




కూసుమంచిలో ఇందిరమ్మ నమూనా ఇంటికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పేదలకు గూడు కల్పించడమే లక్ష్యం

- రానున్న నాలుగేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల ఇళ్ల నిర్మాణం
- రాష్ట్రవ్యాప్తంగా మండల కేంద్రాల్లో నమూనా ఇళ్లు
- రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

6

'ట్యూబ్' యూట్యూబ్ చానెల్ ద్వారా ఆంగ్ల భాషా బోధన
ప్రపంచవ్యాప్తంగా 7.24లక్షల మంది ఫాలోవర్లు
ప్రత్యేకత చాటుకుంటున్న టీచర్ గౌతమి
ఖమ్మంలో ప్రభుత్వ పాఠశాలలో విధులు



6

విశ్వగురు.. ఈ పంతులమ్మ



ఖమ్మంలో కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని

అధికార కాంక్షతోనే జమిలి ఎజెండా

- అది ప్రజాస్వామ్య ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం
- ఈనెల 30న నల్గొండలో సీపీఐ వందేళ్ల ఉత్సవాల ప్రారంభ సభ
- ఖమ్మంలో 2025 డిసెంబరు 26న ముగింపుసభ : కూనంనేని

6

నేడు ఎన్టీఆర్ సినీ
వజ్రోత్సవం

- లకారం ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక కార్యక్రమాలు

ఖమ్మం సంక్షేమవిభాగం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విశ్వ విఖ్యాత నటుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ సంబరాలకు నగరం వేదికగా నిలువనుంది. ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్‌లోని ఎన్టీఆర్ పార్కులో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఎన్టీఆర్ సినీ రంగప్రవేశం చేసి శనివారం నాటికి 75ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ వేడుకలను ఏర్పాటు చేశారు. సాయంత్రం 6గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ముఖ్యఅతిథిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరవుతారు. ఈ ఉత్సవాల్లో ఎన్టీఆర్ చిత్రాలతో కూడిన లేజర్ షో, పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాల పాటల విభావరి, ఏకపాత్రాభినయాలు, నృత్య కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు.

నేడు జాతీయ
లోక్ అదాలత్

ఖమ్మంలీగల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నారు ఈ లోక్‌అదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ ప్రారంభించనున్నారు. దీనిని సివిల్, క్రిమినల్ కేసుల్లోని ఇరుపక్షాల వారు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లోక్ అదాలత్‌లో మోటారు వాహనాల యాక్సిడెంట్ కేసుల బీమాకు సంబంధించిన కేసులను, సివిల్ కేసులను మూడవ అదనపు జిల్లా ప్రధాన న్యాయాధికారి నిర్వహించనున్నారు.

మళ్లీ జ్వరాలు

వాతావరణంలో మార్పులతో ఒక్కసారిగా చలి తీవ్రత పెరిగింది. దీంతో చాలామంది జ్వరాలు, దగ్గు, జలుబు, ఉబ్బసం, శ్వాసకోశ సమస్యల బారిన పడుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు ఎక్కువ ఇబ్బంది పడుతున్నారు. సాధారణ జ్వరాలతోపాటు, వైరల్, టైఫాయిడ్, డెంగ్యూ కేసులు ఎక్కువ వస్తుండటంతో ఆస్పత్రులన్నీ రద్దీగా మారిపోయాయి. సందట్లో సడేమియాలా కరోనా కూడా విజృంభిస్తున్నట్లు సమాచారం. అయితే జిల్లా జనరల్ ఆస్పత్రిలోనూ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వద్ద కూడా కరోనా కిట్లు అందుబాటులో లేకపోవడం ఆ దిశగా అధికారులు దృష్టి సారించకపోవడం గమనార్హం.



చలి పులి...

- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- తీవ్రజ్వరం, దగ్గు, ఆయాసంతో ఇబ్బందులు పడుతున్న జనం
- న్యుమోనియా బారిన చిన్నారులు
- వైరల్ ఇన్ఫెక్షన్‌తో ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి
- కరోనా పరీక్షలకు అందుబాటులోలేని కిట్లు

చలి విజృంభిస్తుండటంతో పెరుగుతున్న కేసులు

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏటా చలికాలంలోనే జ్వరాలు ఎక్కువగా నమోదవుతాయి. నవంబర్లో సాధారణ జ్వరాలు నమోదు కాగా, ఇప్పుడు వాటి సంఖ్య బాగా పెరిగింది. జిల్లావ్యాప్తంగా నవంబరు నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 10వేల పైగా కేసులు నమోదయ్యాయి. పీహెచ్‌సీలు, ప్రైవేటు ఆస్పత్రులు, పీఎంపీల వద్ద చికిత్సలు చేయించుకున్న వారు మరో 15వేల మంది వరకు ఉంటారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లిన వారు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. చలికాలంలో తగినంత పోషకాహారం, నీరు తీసుకోకపోవటంతో రోగ నిరోధక శక్తి తగ్గి వ్యాధులు సోకుతాయని వైద్యులు చెబుతున్నారు. చలితో జ్వరాలతోపాటు అలర్జీ సమస్యలు ఉత్పన్నమవుతాయి.

వ్యాధుల బారిన చిన్నారులు

చాలామంది చిన్నారులు న్యుమోనియా బారినపడుతున్నారు. జనాభా ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో కేసులు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. వైరల్ ఇన్ఫెక్షన్‌తో ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తూ జ్వరం కేసులు పెరుగుతున్నాయి. తీవ్ర జ్వరంతో ఉన్న వారు సమీప ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ప్రతీ ఇంట్లో జ్వరం లక్షణాలు కనిపిస్తున్నాయి. చాలామంది ముందు జాగ్రత్తగా దుకాణాల్లో మందులు కొనుక్కుని వాడుతున్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో నవంబరులో 7,268మంది ఓపీ నమోదవ్వగా ఆస్పత్రిలో చేరిన వారు 641మంది, క్యాజువాలిటీలో చికిత్స పొందిన వారు 173మంది ఉన్నారు. డిసెంబరులో ఇప్పటివరకు 2996 ఓపీ నమోదవగా 526మంది అధికారికంగా (మిగతా 6వ పేజీలో)

గత వారం రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలు

తేదీ	ఖమ్మం	కొత్తగూడెం
డిసెంబరు13	30/17	31/17
డిసెంబరు12	30/24	30/24
డిసెంబరు11	30/24	30/24
డిసెంబరు10	32/23	32/23
డిసెంబరు9	32/24	31/23
డిసెంబరు8	31/23	31/23
డిసెంబరు7	32/24	32/24

ఇక ఇంటికే
వరి విత్తనాలు

- ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసుకునే అవకాశం
- 15 కిలోల విత్తన బస్తా ధర రూ.700
- 25 కిలోల బస్తాకు రూ.995



ఖమ్మం వ్యవసాయం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన వరి విత్తనాలు చేరువ చేయడానికి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ వినూత్నసేవలకు శ్రీకారం చుట్టింది. ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుంటూ.. విత్తనాలు సరఫరా చేస్తోంది. సీడ్ కార్పొరేషన్ పరిధిలోని ఖమ్మం కార్యాలయ ఫోన్ నెం 9849908760కు కాల్ చేసి విత్తనాలను రైతులు ఇంటి వద్దనే డెలివరీ తీసుకోవచ్చు. రాష్ట్రంలో యాసంగి సీజన్‌లో 2.5 లక్షల ఎకరాలకు సరిపడా 50వేల క్వింటాళ్ల నాణ్యమైన వరి విత్తనాలు సరఫరా చేయాలని లక్ష్యం పెట్టుకున్న విత్తనాభివృద్ధి సంస్థ.. రకరకాల మార్గాల ద్వారా రైతులకు చేరువయ్యేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే ఎలాంటి రవాణా చార్జీలు లేకుండా.. రైతుల ఇంటివద్దకే విత్తనాలు పంపించాలని నిర్ణయించింది. యాసంగి పంటకాలంలో రైతులనుంచి గిరాకీ ఎక్కువగా ఉన్న తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్- 15048), కూనారం సన్నాలు (కేఎన్ఎం- 163), జగిత్యాల సన్నాలు (జేజీఎల్- 27356)తోపాటు.. దొడ్డు రకాలైన కేఎన్ఎం- 118, జేజీఎల్- 4423, ఎంటీయూ- 1010, ఆర్ఎన్ఆర్- 29325.. ఇలా ఏడు రకాల వరి విత్తనాలను సరఫరా చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లో 10కిలోల విత్తన బస్తా రూ.900 ఉండగా.. విత్తనాభివృద్ధి సంస్థ 15కిలోల బస్తాకు రూ.700, 25 కిలోల బస్తాకు రూ.995 చొప్పున ధర నిర్ణయించడం విశేషం. ప్రైవేటు విత్తన వ్యాపారులతో పోలిస్తే తక్కువ ధరకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేస్తున్నామని విత్తనాభివృద్ధి సంస్థ ప్రాంతీయ మేనేజర్ ఎస్.భిక్షం తెలిపారు. రైతులు నలుగురైదుగురు కలిసి టన్ను ఆ పైన మొత్తంలో ఆర్డర్ పెడితే ఇంటికే వచ్చి విత్తనాలను అందజేస్తామని తెలిపారు. రైతులు సఖ్యతగా ఉండటానికి, తక్కువ ధరకు విత్తనాలు లభించడానికి ఇది దోహదం చేస్తున్నదని తెలిపారు.



అల్లిపల్లిలో జరిగిన సభలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

పల్లెలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి..

- గిరిజనుల సంప్రదాయాలను అందరూ గౌరవించాలి
- అల్లిపల్లి పంచాయతీని ఆదర్శంగా తీసుకోవాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

దమ్మపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామ పంచాయతీలూ ఆదర్శ పంచాయతీలగా గుర్తింపు పొందేలా కృషి చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని అల్లిపల్లి గ్రామంలో రూ.49లక్షలతో నూతన పంచాయతీ భవనాన్ని, సీసీ రోడ్లు, పామాయిల్ బోర్డు అడ్వైజరీ కమిటీ మెంబర్, గ్రామస్థుల సహకారంతో నిర్మించిన పాఠశాల భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీలు అల్లిపల్లి గ్రామ పంచాయతీ తరహాలో ఆదర్శ పంచాయతీలుగా గుర్తింపు పొందేలా కృషి చేయాలని తుమ్మల అన్నారు. ఆలపాటి రాంచంద్రప్రసాద్ సహకారం, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధికి కృషి చేయటంతోపాటు పాఠశాల భవనాన్ని నిర్మించటాన్ని తుమ్మల అభినందించారు. తాను మంత్రిగా దమ్మపేట మండలంలో అన్ని గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించటమే కాకుండా అన్ని గ్రామాలకు 100శాతం తారు రోడ్లను నిర్మించటం జరిగిందని గుర్తు చేశారు. భద్రాద్రి జిల్లా పూర్తిగా ఏజెన్సీ ప్రాంతంకావడంతో పాటు సంబంధిత చట్టాలు ఉన్నప్పటికీ ఇక్కడ ఎన్నో ఏళ్లుగా అన్ని వర్గాల ప్రజలు కలిసి జీవనం సాగిస్తున్నారని తుమ్మల ప్రశంసించారు. ఈ ప్రాంతంలో దశాబ్దాల నుంచి ఎవరు భూమిని సాగు చేసుకుంటున్నారో పరిశీలించి, ఆ రైతులకే రెవెన్యూ అధికారులు హక్కులు కల్పించాలని సూచించారు.

సమావేశంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా అభివృద్ధి తుమ్మల ఘనతేనని కొనియాడారు. అల్లిపల్లి గ్రామంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల (మిగతా 6వ పేజీలో)



కిరాతకులు...

ముగ్గురు కిలేడీలు!

- నేలకొండపల్లిలో వృద్ధ దంపతుల హత్య ఘటనలో కీలకపాత్ర
- కిరాయికి దిగి మాటలు కలిపి నమ్మించిన వైనం
- ప్రధాన నిందితుడితో కలిసి గొంతు పిసికి చంపి బంగారం దోపిడీ
- ఎనిమిదిని అరెస్టు చేసిన పోలీసులు

ఖమ్మం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి మండల కేంద్రంలో గత నెల 26న జరిగిన వృద్ధ దంపతుల హత్య ఘటనలో విస్తుగొలిపే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనలో పోలీసులు మొత్తం 8మందిని అరెస్టు చేయగా, వారిలో ముగ్గురు మహిళలు ఉండటం గమనార్హం. పక్కా ప్లాన్‌తో కిరాయికి దిగి, ఇంటి యజమానులను నమ్మించి చివరకు వారిద్దరినీ హత్యచేసి బంగారంతో ఉడాయించిన ఈ ఘటనలో ముగ్గురు మహిళలు కీలకంగా వ్యవహరించడం కలకలం రేపుతోంది. గత నవంబరు 26న నేలకొండపల్లికి చెందిన యర్రా వెంకటరమణ(62), ఆయన భార్య కృష్ణకుమారి(60) దారుణహత్యకు గురైన విషయం విదితమే. హత్య ఘటనలో ఎలాంటి ఆధారాలు లభించకుండా నిందితులు జాగ్రత్త పడటంతో ఈ కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. దీంతో 45మంది సభ్యులతో ఆరు బృందాలుగా ఏర్పడి 15 రోజులు శ్రమించి ఎట్టకేలకు మిస్టరీ ఛేదించారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడు అబీద్‌తో పాటు సురేశ్, షాబీనా, హుస్సేన్‌బీ, జమాల్‌బీ, ఫరీద్, మణికంఠ, అనుమోలు అనిల్‌కుమార్ అనే వ్యక్తులను అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు మహిళలకు ఇప్పటివరకు ఎలాంటి నేర చరిత్ర లేదు. అయినా హత్య ఘటనలో పాలుపంచుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఖమ్మం సీపీ సునీల్‌దత్ శుక్రవారం మీడియాకు తెలిపిన మేరకు పూర్వాపరాలు ఇలా వున్నాయి...

అలా మొదలైంది..

ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం మోగులూరు గ్రామానికి చెందిన షేక్ అబీద్ అలియాస్ అబీద్ అలీ, సోహైల్, ఆరిఫ్‌కు 2011లో కంచికచర్ల పోలీస్‌స్టేషన్లో నమోదైన ఓ హత్య కేసులో 2014లో జీవితఖైదు శిక్ష పడగా.. రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్లాడు. 2024లో పెరోల్ మీద బయటకొచ్చి తిరిగి జైలుకు వెళ్లకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. ఆ తర్వాత కోదాడలో షేక్ హుస్సేన్ బీ అనే మహిళ ఇంటి ఎదురుగా గది అద్దెకు తీసుకుని నాలుగు నెలలు (మిగతా 6వ పేజీలో)



వెంకటరమణ, కృష్ణకుమారి(ఫైల్)

మధిరకు కొత్త కళ

- నాలుగు వరుసల రోడ్డు ఇక ఆరు వరుసలుగా విస్తరణ
- 2.1 కి.మీ. మేర నిర్మాణానికి రూ.19 కోట్లు మంజూరు
- రేపు శంకుస్థాపన చేయనున్న ఉప ముఖ్యమంత్రి భట్టి

మధిర టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో ప్రస్తుతం ఉన్న నాలుగు వరుసల ప్రధాన రహదారిని ఆరు వరుసల రహదారిగా విస్తరించేందుకు ప్రభుత్వం రూ.19 కోట్ల నిధులు మంజూరు చేసింది. వైరా రోడ్డులోని వైఎస్ఆర్ సర్కిల్ నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు 2.1కిలోమీటర్ల మేర ప్రస్తుతం ఉన్న నాలుగు వరుసల రహదారిని ఆరు వరుసలుగా మార్చనున్నారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రెయిన్‌ను ఫుట్‌పాత్‌గా మార్చనున్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, రాకపోకలు సాఫీగా జరిగేలా మధిర అభివృద్ధిలో భాగంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిధులు మంజూరు చేయించారు. ఈ పనులకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు.

గతంలో భట్టి డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నప్పుడు మధిర పట్టణంలో మెయిన్ రోడ్డును నాలుగు వరుసల రోడ్డుగా మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేయించారు. ఆ తర్వాత కాలక్రమంలో దుకాణదారులు డ్రెయిన్లపై నిర్మాణం చేయడమే కాకుండా రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్‌కు తరచూ అంతరాయం కలుగుతోంది. ఇప్పుడు డ్రెయినేజీ వరకు రోడ్డు నిర్మించి డ్రెయినేజీపై టైల్స్ వేసి ఫుట్‌పాత్‌లు నిర్మించనున్నారు.

నేడు, రేపు డిప్యూటీ సీఎం పర్యటన

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గంలో రెండు రోజులు పర్యటించనున్నారు. శుక్రవారం రాత్రి ఖమ్మం చేరుకోనున్న ఆయన శనివారం ఉదయం చింతకాని, బోనకల్ మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు బోనకల్‌లోని బీసీ గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకొంటారు. శనివారం రాత్రి మధిరలోని క్యాంపు కార్యాలయంలో బసచేసి ఆదివారం మధిర పట్టణంలో ఆరులైన్ల రోడ్డు నిర్మాణానికి, మధిర, ఎర్రుపాలెం మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి



పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ

- పేర్లు తొలగించే సమయంలో నిబంధనలను పాటించాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి

6



విశ్వగురు.. ఈ పంతులమ్మ

'ట్యూబ్' యూట్యూబ్ చానెల్ ద్వారా ఆంగ్ల భాషా బోధన

- ప్రపంచవ్యాప్తంగా 7.24లక్షల మంది ఫాలోవర్లు
- ప్రస్తుతం ఖమ్మం మామిళ్లగూడెంలో ప్రభుత్వ టీచర్‌గా విధులు

ఖమ్మం సాంస్కృతికం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : టకటకా ఆంగ్లం మాట్లాడే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అనగానే మనకు బెండపూడి పాఠశాల గుర్తొస్తుంది. ఆ తరహా ప్రభుత్వ పాఠశాలల అధ్యాపకుల కృషి విదేశీయుల ప్రశంసలు సైతం అందుకున్న విషయం విదితమే. ఖమ్మంలో సైతం ఆ తరహా ఆంగ్ల సంభాషణలతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాణించేందుకు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు భూక్యా గౌతమి చొరవ చూపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఆంగ్లభాషా ప్రావీణ్యానికి ఆమె పాటుపడుతున్నారు..



ఒక స్కూల్‌కే పరిమితం కాదు...

సాధారణంగా ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ఏదో ఒక పాఠశాలలో బోధిస్తుంటారు. కానీ ఈ పంతులమ్మ విశ్వగురుగా మారింది. ఆన్‌లైన్ పద్ధతిలో ఆంగ్లభాష బోధన చేస్తుండడంతో ఈమె విశ్వగురుగా మారింది. సాధారణంగా ఉపాధ్యాయులకు కొందరు విద్యార్థులుంటారు.. కానీ ఈమెకు 7.24లక్షల మంది విద్యార్థులు ఫాలోవర్లుగా ఉన్నారు. ఖమ్మం, తెలంగాణవ్యాప్తంగానే కాక ఇతర రాష్ట్రాలు, విదేశాలకు చెందిన ఫాలోవర్లు సైతం అందులో ఉండటం గమనార్హం. ఎటువంటి ఫీజు ఆశించకుండా ఉచితంగానే పలు విధానాల ద్వారా ఆంగ్ల భాషా సామర్థ్యాన్ని పెంపొందించే కృషిలో నిమగ్నమయ్యారు.

సంభాషణల ద్వారా..

ఆంగ్లంలో బెరుకు, భయం పోగొట్టి అభ్యాసకుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేది సంభాషణ. ఆంగ్లంలో సంభాషణ స్థాయికి వస్తే ఆ తరువాత గ్రామర్ టిప్స్ నేర్పించవచ్చు ఈ సూత్రాన్ని పాటిస్తూ గౌతమి తన ఆంగ్ల బోధన చేస్తున్నారు. ఎనిమిదో తరగతి చదువుతున్న తన కూతరు స్వదేశీ సహకారంతో ఒకో రకం సంభాషణలను రూపొందిస్తూ వాటిని తన యూట్యూబ్ ఛానెల్‌లో అప్‌లోడ్ చేయటం ద్వారా లక్షల మంది ఫాలోవర్ల ఆంగ్ల లోటును అధిగమించేందుకు తోడ్పడుతున్నారు.

రోల్‌మాడల్

విద్యార్థులకు ఉపాధ్యాయులు రోల్ మోడల్స్. ఈ సూత్రాన్ని పాటిస్తూ గౌతమి విద్యార్థులకు ఆదర్శంగా ఎదిగారు. చిన్న వయస్సులోనే వివాహం కావటంతో ఇంటర్మీడియెట్‌లోనే చదువును ఆపేసిన గౌతమిని ప్రభుత్వ ఉపాధ్యాయుడైన భర్త మాలోతు కోటేశ్వరరావు చదువులో ప్రోత్సహించారు. ఆ ప్రోత్సాహంతో చదువును తిరిగి ప్రారంభించి ఎంఏ లిటరేచర్, బీఈడీ చదివారు. అలా ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించారు.


తన పాఠశాల విద్యార్థులతో గౌతమి

కరోనా సమయంలో ఆలోచన...

యూట్యూబ్ ఛానెల్ ద్వారా ఆంగ్ల బోధన చేయాలన్న ఆలోచనకు కరోనా కారణం అయ్యింది. కరోనా లాక్‌డౌన్ సమయంలో పాఠశాలలు సైతం బంద్ అయిన విషయం విధితమే. ఆ సమయంలో విద్యార్థులకు ఆన్‌లైన్ పద్ధతిలో పాఠాలను బోధించగా చాలామంది విద్యార్థులు సెల్‌ఫోన్ సమస్య, నెట్ బ్యాలెన్స్ సమస్య, కవరేజీ సమస్య తదితర ఆటంకాల వల్ల సరిగా ఆ సేవలను అందుకోలేక పోయారు. అటువంటి వారికోసం ట్యూబ్ అనే యూట్యూబ్ ఛానెల్‌ను ప్రారంభించారు. విద్యార్థులు పాఠం చెప్పేటప్పుడే కాక తమకు అనువైన వేళల్లో ఆ పాఠాలను వినేందుకు పాఠాలను రికార్డు చేసి యూట్యూబ్‌లో చేర్చటం ప్రారంభించారు. అలా శ్రీకారం చుట్టుకున్న ఆన్‌లైన్ ఆంగ్ల బోధన క్రమంగా లక్షల మంది విద్యార్థుల స్థాయికి చేరింది. స్పోకెన్ ఇంగ్లీష్ ప్రక్రియ ఆన్‌లైన్‌కే పరిమితం కాకుండా పుస్తక రూపంలో కూడా విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు.. జీరో టు హీరో అనే పేరుతో ఆమె వెలువరించిన ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకం విద్యార్థుల ఆదరణ పొందింది.

1200 కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలి

- శ్రీనిధి రుణాలు పొందిన వారికి ఉచిత బీమా
- మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ మహేందర్

ఖమ్మం సంక్షేమవిభాగం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం పనిచేస్తున్న 6,200 మహిళా స్వయం సహాయక సంఘాలకు తోడు గా మరో 1200 కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)ప్రాజెక్టు డైరెక్టర్ మహేందర్ ఆర్పీలకు సూచించారు. శుక్రవారం ఖమ్మం కేఎంసీలో నిర్వహించిన ఆర్పీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన పథకాలను వివరించారు. శ్రీనిధి, బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలు తీసుకున్న మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లింపులు చేస్తోందని, ఎవరైనా మహిళ సభ్యురాలు సాధారణ మరణం సంభవించినా ఆమె తీసుకున్న రుణం పూర్తిగా మాఫీ అవుతుందని వివరించారు. ఇందిరా మహిళ శక్తి వ్యాపారాల ఏర్పాటులో ఖమ్మం జిల్లా లక్ష్యం సాధించిందని అభినందించారు. అయితే రుణాలు తీసుకున్న ప్రతి సభ్యురాలితో వ్యాపారం ఏర్పాటు చేయటం ద్వారా ఆయా కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమవుతాయన్నారు. పెరిగిన జనాభా ప్రాతిపదికన మహిళా స్వయం సహాయక సంఘాలు పెరగాలన్నారు. ఆర్పీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాల్లో జూన్‌నుంచి నవంబరువరకు వేతనాల బడ్జెట్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందని సోమవారం వరకు ఆర్పీలకు వేతనాలు బ్యాంకు ఖాతాలకు చేరతాయని ఆర్పీలకు తీపికబురు చెప్పారు. డీఎంసీ సుజాత, టీఎంసీ సుజాత, సీవోలు సాల్మ, ద్రౌపతి, రోజా పాల్గొన్నారు.

పల్లెలు అన్ని రంగాల్లో

అభివృద్ధి చెందాలి

(5వ పేజీ తరువాయి)

ప్రారంభోత్సవ కార్యక్రమంలో తుమ్మలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రావెల్ రహదారుల నిర్మాణానికి రూ.25.66 కోట్లు మంజూరయ్యాయని, రైతులు రహదారుల నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, కొత్తగూడెం ఆర్డీవో మధు, పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్, బండి భాస్కర్, దమ్మపేట సొసైటీ ఛైర్మన్ ఎల్లిన రాఘవరావు, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ వాసం రాణి, కొయ్యల అచ్యుతరావు, కేవీ సత్యనారాయణ, రావు గంగాధరరావు, కాసాని నాగప్రసాద్, ఎర్రా వసంతరావు, మద్దిశెట్టి సత్యప్రసాద్, వాసం శ్రీను, మాజీ సర్పంచ్ అత్తులూరి వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబాలు

గడిచేది ఎలా!?

- బిల్లులు రాక టిప్పర్ ఓనర్లు, వర్కర్ల అవస్థలు
- రెండు నెలలుగా బిల్లులు నిలిపేసిన జెన్‌కో

మణుగూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆ కుటుంబాలు రెక్కాడితే డొక్కాడనివి... కాయకష్టం తప్ప మరో వ్యాపకంలేని జీవితాలు వారివి. సామాన్య మధ్యతరగతి వర్గాలకు చెందిన దాదాపు 600 కుటుంబాల వారు గత రెండు నెలల నుంచి గడ్డు కాలాన్ని అనుభవిస్తున్నారు. మణుగూరులోని టిప్పర్ లారీ ఓనర్లు అనుసంధానంగా ఆధారిత వర్కర్ల కుటుంబాల గోడు ఇది.

మణుగూరు సింగరేణి మైన్స్‌నుంచి మండలంలో భద్రాద్రి థర్మల్‌పవర్ ప్రాజెక్టుకు బొగ్గు సరఫరా అవుతుంది. ఈబొగ్గు ద్వారానే బీటీపీఎస్‌లో ఉన్న మూడు యూనిట్లు విద్యుదుత్పత్తి చేస్తుంటాయి. దాదాపు 130టిప్పర్లు ప్రతినెల బీటీపీఎస్‌కు కావాల్సిన లక్ష టన్నులకు పైగా బొగ్గును సరఫరా చేస్తుంటాయి. ముగ్గురు కాంట్రాక్టర్ల ద్వారా 130టిప్పర్లు బొగ్గును ఎగుమతి చేస్తున్నాయి. అయితే ఏ నెలకు ఆ నెల బిల్లులు వస్తేగాని బండి మెయింటనెన్స్, డీజిల్, డ్రైవర్, క్లీనర్ల జీత భత్యాలు. ఇతరత్రా గుమస్తాల ఖర్చుల అన్ని చక్కబెట్టుకోవాల్సిన పరిస్థితులుంటాయి. అయితే రెండునెలలుగా కాంట్రాక్టర్లు బిలులు చెల్లించక పోవడంతో టిప్పర్ ఓనర్స్ నుంచి కిందిస్థాయి డ్రైవర్లు, క్లీనర్లు, గుమస్తాలు, బొగ్గు ముఠా హమాలీలు, మెకానిక్ కుటుంబాలు ఎక్కడికక్కడ ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఏ రోజుకారోజు భారం పెరిగిపోతుండటంతో ఓనర్లు వారి బాధలు చెప్పుకోలేని పరిస్థితి. వీరిపై ఆధార పడిన కుటుంబాల వెతలు వర్ణనాతీంగా మారాయి.

జెన్‌కో నుంచి సమస్యే..

బొగ్గు ఎగుమతులు జరిపిన కాంట్రాక్టర్లకు జెన్‌కో ఏ నెలకు ఆ నెల బిల్లులు చెల్లించాల్సి ఉండగా నవంబరు నుంచి బిల్లులు రావడం లేదు. ఒక్క మణుగూరు ఏరియాలో రెండు నెలలకు దాదాపు రూ.3 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ శాఖలో బిల్లులు చెల్లింపులో జరుగుతున్న జాప్యాన్ని సరిచేస్తే కానీ 600 కుటుంబాలకు జీవనభృతి సాఫీగా సాగే అవకాశం ఉంటుంది. జెన్‌కో ఉన్నతాధికారులు సరైన చర్యలు తీసుకోవాలని బాధిత టిప్పర్ ఓనర్లు, డ్రైవర్లు, క్లీనర్లు, మెకానిక్స్ గుమస్తాలు, బొగ్గు ముఠా కార్మికులు కోరుతున్నారు.

సోనియానగర్‌లో ప్రభుత్వ భూమిలో

చర్చి నిర్మాణ యత్నం

- అడ్డగించి అధికారులకు సమాచారం ఇచ్చిన భజరంగ్‌దళ్
- వెంటనే సందర్శించి చర్యలకు ఆదేశించిన అధికారులు

పాల్వంచ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ పట్టణ పరిధి సోనియానగర్‌లో చర్చి నిర్మించాలని యత్నించిన వారిని భజరంగ్‌దళ్ కార్యకర్తలు అడ్డుకుని అక్రమంగా చర్చి నిర్మాణానికి పాల్పడుతున్న విషయాన్ని అధికారులకు సమాచారం ఇచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన మునిసిపల్ కమిషనర్ కే.సుజాత, మండల ఆర్‌ఐలు రవికుమార్, హచ్చా, టౌన్‌ప్లానింగ్ అధికారి నవీన్ శుక్రవారం ఆ ప్రాంతాన్ని సందర్శించి సంబంధిత వ్యక్తులను విచారించారు. భజరంగ్‌దళ్, స్థానికుల కథనం మేరకు ఆ స్థలం అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించిన ప్రభుత్వ భూమి అని తెలుస్తోంది. దీనిపై మునిసిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా చర్చి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించామని, సంబంధిత వ్యక్తిని డాక్యుమెంట్ అడగ్గా పొంతనలేని జిరాక్స్ కాపీలు చూపారని అన్నారు. పూర్తి ఒరిజినల్ డాక్యుమెంట్ తీసుకుని కార్యాలయానికి రావాలని ఆదేశించారు. అనుమతి లేకుండా నిర్మాణానికి పూనుకోవడం, ఆ స్థలాన్ని మట్టితో నింపి చదును చేయడం పట్ల చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించామన్నారు. వెంటనే స్పందించిన అధికారులకు భజరంగ్‌దళ్ కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ కార్యకర్తలు గడిదేశి వెంకటేశ్వర్లు, గంగాధరి సీత, వింజమురి మురళీ, ఆర్.మధుసూదనచారి, భూక్య మోహన్, మాధవరావు, ఎన్.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అండర్-14 జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైన తనిష్క్

లక్ష్మీదేవిపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అండర్-14 జిల్లా క్రికెట్ జట్టుకు శ్రీవిద్య పాఠశాలకు చెందిన విద్యార్థి తనిష్క్ ఎంపికైనట్టు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సుజిత్ కుమార్ తెలిపారు. తనిష్క్ ఈనెల 16నుంచి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్న నాకౌట్ టోర్నీలో పాల్గొననున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వివేకవర్ధిని విద్యాసంస్థల ఛైర్మన్ ఎంవీ చౌదరి మాట్లాడుతూ జిల్లా క్రికెట్ జట్టుకు తనిష్క్ ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఆటలతోపాటు విద్యలోకూడా రాణించాలని, క్రికెట్‌లో మరింత ప్రతిభకనబర్చి తల్లిదండ్రులకు, జిల్లాకు పేరుప్రతిష్ఠలు తేవాలన్నారు.


తనిష్క్‌ను అభినందిస్తున్న దృశ్యం

మళ్లీ విషజ్వరాలు

(5వ పేజీ తరువాయి)

నమోదయ్యారు. జిల్లాలో ఇంకా వేల సంఖ్యలో జ్వరబాధితులు ఉన్నారు. ఎండ ప్రభావం పెరిగితేనే జ్వరాలు తగ్గుముఖం పడతాయని వైద్యులు చెబుతున్నారు. జ్వరం, జలుబు, దగ్గు, అలర్జీకి సంబంధించిన మందులను అందుబాటులో ఉంచామని, వైద్యులంతా ఆస్పత్రుల్లోసేవలు అందిస్తున్నారని తెలిపారు.

కరోనా కిట్లు ఏవీ...?

గత మూడేళ్ల క్రితం కరోనా మహమ్మారి ప్రజలను అతలాకుతలం చేసింది. అయితే ఆ లక్షణాలు ప్రస్తుతం కనిపిస్తున్నాయి. కరోనా పరీక్షలు నిర్వహించేందుకు జిల్లాలో ఎలాంటి కిట్లు అందుబాటులో లేకపోవడం గమనార్హం. చిన్నపిల్లలు, పెద్దలు, వృద్ధులు దగ్గు ఆయాసంతో బాధపడుతున్నారు. ఇలాంటి వారికోసం కరోనా పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అంతే కాదు ఇతర దేశాలకు వెళ్లే వారికి విధిగా కరోనా పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే అలాంటి వారికి కూడా పరీక్షలు నిర్వహించేందుకు కరోనా కిట్లు జిల్లాలో అందుబాటులో లేవని చెబుతున్నారు. కనీసం ప్రభుత్వ ఆస్పత్రిలోనైనా అందుబాటులో ఉండాల్సి ఉంది.

ర్యాపిడ్ టెస్టులు చేస్తున్నాం...

డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, సూపరింటెండెంట్

జిల్లా ఆస్పత్రికి అత్యవసరంగా వచ్చిన వారికి ర్యాపిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. విదేశాలకు వెళ్లే వారికి, అనుమానితులకు మాత్రం పరీక్షలు నిర్వహిస్తూనే ఉన్నాం. అయితే కరోనా కిట్లు మాత్రం సరఫరా కావాల్సి ఉంది.

ప్రతిపాదనలు పంపించాం

డాక్టర్ కళావతిభాయి, డీఎంహెచ్‌వో

కరోనా కిట్లు అందుబాటులో లేని మాట వాస్తవమే. ఇండెంట్ పంపించాం. రావాల్సి ఉంది. ప్రైవేటులో పరీక్షలు నిర్వహించుకుని పాజిటివ్ వస్తే మాత్రం మందులు మాత్రం అందుబాటులో ఉన్నాయి.

పేదలకు గూడు కల్పించడమే లక్ష్యం

- రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పేదవాడి సొంత ఇంటికల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో రానున్న నాలుగేళ్లలో 20లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం కూసుమంచి మండల పరిషత్ ఆవరణలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి ఇందిరమ్మ ఇంటి నమూనా నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడగానే చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 80 లక్షల మంది ఇందిరమ్మ ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీటిలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి మొదటి విడతగా 4.5లక్షల మందికి ఇళ్లు మంజూరు చేయనున్నట్టు వివరించారు.

ఇందిరమ్మ ఇళ్ల యాప్ ద్వారా పేదలు ప్రస్తుతం నివసించే గుడిసె, షెడ్డు, టార్పాలిన్ కవర్ ఇళ్ల ఫొటోలు తీసుకుని వివరాలు నమోదుచేయడం జరుగుతుందని, యాప్‌లో నమోదు చేసిన వివరాల ప్రకారం అతి పేదలను ఎంపికచేసి మొదటివిడత లబ్ధి చేకూరుస్తామన్నారు. నాలుగుస్థాయిల్లో రూ.5లక్షలు మంజూరు చేస్తామన్నారు. ఫౌండేషన్ వేసిన తర్వాత రూ.లక్ష, లెంటల్ లెవల్‌లో రూ.లక్షా 25వేలు, స్లాబ్ అనంతరం రూ.లక్షా75వేలు, పూర్తయిన అనంతరం మిగిలిన లక్ష అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని మండల కేంద్రాల్లో 580నమూనా ఇళ్లు నిర్మించడం జరుగుతుందన్నారు. అక్కడే అవసరమైతే తక్కువ ఖర్చులో ఎలా ఇల్లు నిర్మించాలో మేస్త్రీలకు శిక్షణ ఇస్తామన్నారు. దరఖాస్తులు అందించని వారుంటే కుటుంబసభ్యులు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్టు తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని తెలిపారు. జిల్లాలో 3.57లక్షల మంది ఇళ్లకోసం అర్జీలు పెట్టుకున్నారని, ఇప్పటికి 16శాతం దరఖాస్తుల స్క్రూట్నీ పూర్తయిందని, మిగిలినవి ఈ నెలాఖరుకు పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, మండల ప్రత్యేకాధికారి శ్రీలత, హౌజింగ్ ఈఈ శ్రీనివాసరావు, పీఆర్‌ఈఈ వెంకటరెడ్డి, తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.

అధికార కాంక్షతోనే

జమిలి ఎజెండా

- అది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం
- ఖమ్మంలో 2025 డిసెంబరు 26న ముగింపుసభ
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ఖమ్మం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అధికార కాంక్షతోనే జమిలి ఎజెండాను తీసుకొచ్చిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో శుక్రవారం రావిరామకృష్ణ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమిలి ఎన్నికలు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని, జమిలీ ఎన్నికల వల్ల లాభాల కంటే నష్టాలే ఎక్కువ ఉన్నాయన్నారు. బీజేపీ అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతోందనీ, కులాన్ని కాదంటూనే మతాన్ని రెచ్చగొడుతోందన్నారు. ఒకే దేశం.. ఒకే ఎన్నిక అనే నినాదం కారణంగా నిరంకుశత్వం పెరిగి నియంత పాలనకు దారితీసే అవకాశం ఉందన్నారు. ప్రాంతీయ పార్టీలకు ముఖ్యంగా రాష్ట్రాలకు సంబంధించిన హక్కులకు భంగం వాటిల్లే అవకాశంఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. జమిలీని సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు.

దేశంలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతోందనీ, ప్రజలు కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తిస్తున్నారన్నారు. ఈ దశలో వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు ఐక్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలు, అభిప్రాయాలకనుగుణంగా ఐక్య ఉద్యమ నిర్మాణం అవసరమన్నారు. భారత రాజ్యాంగంలో పొందుపర్చిన కొన్ని అంశాలకు సంబంధించి న్యాయస్థానాల తీర్పులు సైతం చర్చనీయాంశమవుతున్నాయన్నారు.

కొన్ని అంశాలకు సంబంధించి సానుకూల తీర్పులొస్తున్నా మొత్తంగా ప్రజాభిప్రాయాన్ని ప్రస్ఫుటింపచేయడం లేదన్నారు. ఇటీవల జరిగిన కొన్ని ఎన్నికలను పరిశీలించినప్పుడు ఈవీఎంల ట్యాంపరింగులకు అవకాశం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై గ్రామస్థాయి నుంచి ప్రజా ఆందోళనలు ఉద్యమాలు చేపట్టాలన్నారు.

నల్గొండలో ఈనెల 30న సీపీఐ వందేళ్ల ఉత్సవాల ప్రారంభసభ నిర్వహిస్తున్నట్టు కూనంనేని తెలిపారు. ఖమ్మంలో వచ్చే యేడాది డిసెంబరు 26న రెండు లక్షల మందితో జాతీయస్థాయి ముగింపు సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా పాల్గొన్నారు.

ఆడ శిశువు

విక్రయం..

- మూడో సంతానాన్ని విక్రయించిన గిరిజన దంపతులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్

జూలూరుపాడు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మూడు నెలల శిశువును తల్లిదండ్రులు అక్రమంగా విక్రయించిన సంఘటన జూలూరుపాడు మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ సంఘటనపై శుక్రవారం రాత్రి జూలూరుపాడు స్టేషన్‌లో కేసు నమోదైంది. మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన గిరిజన దంపతులు తమకు మూడో సంతానంగా పుట్టిన శిశువు(ఆడపిల్లను)ను లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన ఓ దంపతులకు రూ. లక్షకు విక్రయించారు. వీరికి ఇప్పటికే ఒక బాబు, పాప ఉన్నారు. కాగా సమాచారం తెలుసుకున్న ఐసీడీఎస్, చైల్డ్‌లైన్ ప్రొటెక్షన్ సిబ్బంది లక్ష్మీదేవిపల్లి గ్రామంలో సదరు దంపతుల ఇంటికి వెళ్లి పరిశీలించగా మూడు నెలల చిన్నారి వారి వద్దనే ఉన్నట్లు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా శిశువును విక్రయించిన తల్లిదండ్రులపైన, అక్రమ దత్తత తీసుకున్న దంపతులపై నా ఐసీడీఎస్ కొమ్ముగూడెం సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య తెలిపారు. కాగా చిన్నారి దత్తత తీసుకున్న వారి వద్దనే ఇంకా ఉండటం గమనార్హం.

ముగ్గురు కిలేడీలు..

(5వ పేజీ తరువాయి)

నివాసం ఉన్నాడు. ఈ క్రమంలో ఆమెతో పరిచయం ఏర్పడగా, ఆమెకు భర్త లేకపోవడంతో అదికాస్త వివాహేతర సంబంధంగా మారింది. ఆమెతోపాటు కోదాడలో టీ స్టాల్ వద్ద చిట్టిపోలు సురేశ్ (హోమో) అనే వ్యక్తితో కూడా శారీరక సంబంధాన్ని ఏర్పరుచుకున్నాడు.

కోదాడ నుంచి ఖమ్మంలో నివాసం ఉండే దూరపుబంధువైన ఫరీద్ దగ్గరకు వెళ్లి వస్తూ ఉండేవాడు. ఈ క్రమంలోనే ఫరీద్‌కు స్నేహితుడైన అనుమోలు అనిల్ పరిచయం అయ్యాడు. వారి సహకారంతో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం వద్ద సిమ్ కార్డులు అమ్ముకునే మణికంఠ అనే వ్యక్తి వద్దకు వచ్చి ఎలాంటి ఐడీ కార్డులు ఇవ్వకుండా ఒక్కో సిమ్‌కు రూ.వెయ్యి చెల్లించి పది సిమ్ కార్డులు తీసుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తి దగ్గర రూ.10వేలు పెట్టి ఓ ద్విచక్రవాహనాన్ని కొనుగోలుచేసి దానికి మరో నెంబర్‌ను వేయించి తిరగడం ప్రారంభించాడు. ఈ క్రమంలో హుస్సేన్‌బీ నేలకొండపల్లి మండలం బుద్దారంలో నివాసం ఉంటున్న తన స్నేహితురాలు జమాల్‌బీని, తన మేనకోడలు షాబీనాను నిందితుడికి పరిచయం చేసింది. ఆ తర్వాత షాబీనా పరిచయం కూడా శారీరక సంబంధంగా మారింది.

దొంగతనానికి స్కెచ్...

జైలు నుంచి బయటకొచ్చి జల్సాలకు అలవాటు పడిన అబీద్... డబ్బు సంపాదించేందుకు ఎవరింట్లో అయినా దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు. డబ్బున్న వారి ఇళ్ల గురించి ఆచూకీ తీస్తున్న క్రమంలో బుద్దారంలోని జమాల్‌బీ దగ్గరకు వెళ్లి ఆమెతో విషయం చెప్పాడు. ఆమె ద్వారా నేలకొండపల్లిలో పీడీఎస్ బియ్యం వ్యాపారం చేసి యర్రా వెంకటరమణ(62) డబ్బులు బాగా సంపాదించాడని, ఇంట్లో ఆయన, భార్య కృష్ణకుమారి(60) మాత్రమే ఉంటారని తెలుసుకున్నాడు. ఆ ఇంట్లో పలు పోర్షన్లు కిరాయికి ఇస్తారని తెలుసుకున్న అబీద్.. జమాల్‌బీ, సురేష్, షేక్ షాబీనా, షేక్ హుస్సేన్‌బీతో కలిసి వెంకటరమణ ఇంట్లో దొంగతనం చేయాలని ప్లాన్ వేశారు. ముందుగా వారింట్లో కిరాయికి దిగి వారిని నమ్మించి దోపిడీ చేయాలని పథకం వేశారు. అందులో భాగంగా నేరం గురించి పోలీసులకు తెలియకుండా ఉండేందుకు ఖమ్మంలో తనకు పరిచయమున్న సిమ్ కార్డుల విక్రేత మణికంఠ దగ్గర మరో ఐదు సిమ్ కార్డులు కొనుగోలు చేశారు. గత జూలై నెలలోనే జమాల్‌బీ.. అబీద్, సురేష్‌కు వెంకటరమణ ఇల్లు చూపించగా, సురేష్ తన పేరు శ్రీనివాసరావు అని, తనది భద్రాచలం అని చెప్పి తనకు నెలరోజుల పాప ఉందనీ, పాపకు మూడు నెలలు నిండిన తర్వాత భార్యాపిల్లలతో వస్తానని, పోర్షన్ అద్దెకివ్వాలని ఇంటి ఓనర్ వెంకటరమణను కోరాడు. కానీ ఆయన అందుకు నిరాకరించడంతో ప్లాన్ ఫెయిలైంది. ఈ క్రమంలో అబీద్ ప్లాన్ మార్చి షబీనా, హుస్సేన్‌బీలను రంగంలోకి దించాడు. గత నవంబరు రెండో వారంలో షబీనా, హుస్సేన్‌బీ వచ్చి వెంకటరమణ ఇంట్లో గది అద్దెకు తీసుకున్నారు. అనంతరం చనువుగా మాటలు కలిపి వారితో కలిసిపోయారు.

ఆ రోజు ఏం జరిగిందంటే...

అబీద్ తన ప్లాన్ అమలుకు నవంబరు 25ను ఎంచుకున్నాడు. ఆ రోజు రాత్రి షబీనా, హుస్సేన్‌బీ గదిలో ఉండగా.. అబీద్, సురేష్ మోటార్ సైకిల్‌పై నేలకొండపల్లి చేరుకున్నారు. ఎవరూ లేని సమయం చూసి వారిద్దరు కూడా లోపలికి ప్రవేశించారు. కానీ ఆ రోజు కుదరకపోవడంతో ప్లాన్‌ను తెల్లారికి మార్చారు. మరుసటిరోజు రాత్రి సమయంలో షాబీనా, హుస్సేన్‌బీలు కృష్ణకుమారి ఇంట్లో టీవీ చూడటానికి వచ్చి ఆమెను మాటల్లో పెట్టారు. అదే సమయంలో సురేశ్, అబీద్ ఒక్కసారిగా లోపలికి వచ్చి కృష్ణకుమారి గొంతుపిసికి చంపి ఆమె శరీరంపై ఉన్న బంగారాన్ని దోచుకున్నారు. ఇంట్లో ఉన్న బంగారం కూడా తీసుకుని పక్క గదిలో బంగారం కోసం వెతుకున్న సమయంలో వెంకటరమణ లేచి చూడగా.. అతన్ని కూడా గొంతు పిసికి చంపి అక్కడి నుంచి పారిపోయారు.

ఇలా దొరికారు..

వృద్ధ దంపతుల హత్య ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. సంఘటన స్థలంలో ఎలాంటి క్లూలు లభించకపోవడంతో కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. చివరకు సాంకేతిక ఆధారాలతో ప్రధాన నిందితుడు అబీద్ అని గుర్తించారు. గురువారం ఉదయం నేలకొండపల్లి మండలం పైనంపల్లి చెక్‌పోస్టు వద్ద ఖమ్మంరూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి పర్యవేక్షణలో వాహన తనిఖీలు జరుపుతుండగా అబీద్ అనుమానాస్పదంగా పట్టుబడ్డాడు. అనంతరం అతడిని విచారించగా.. గుట్టు మొత్తం రట్టయింది. అతడు తెలిపిన వివరాల మేరకు మిగతా ఏడుగురిని కూడా అరెస్టు చేశారు. వారి నుంచి ఎనిమిది తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 8మందిని రిమాండ్ చేశారు.

పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతి దశలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఓటరు సవరణ జాబితాపై ఆయన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో ఓటరు సవరణ జాబితా 2025, వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా నమోదుపై జిల్లాలో చేపడుతున్న చర్యలను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వివరించారు. అనంతరం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఉన్న తప్పు ఒప్పులను సరి చేసేందుకు ఓటరు సవరణ జాబితా ఒక మంచి అవకాశమని, ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహిస్తే ఓటరు జాబితా సవరణ విజయవంతంగా పూర్తి చేయగలమన్నారు.

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 5 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, వీటికి సంబంధించి మొత్తం 12 లక్షల 27వేల 230 ఓటర్లతో డ్రాఫ్ట్ ఓటర్ జాబితా తయారు చేశామని, జిల్లాలో జనాభా ఓటర్ల నిష్పత్తి 693 మహిళలు, పురుషుల నిష్పత్తి 1075 గా ఉందని, జిల్లాలో కొత్తగా ఐదు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించినట్లు కలెక్టర్ తెలిపారు.

'ఓటరు నమోదుపై దృష్టి పెట్టాలి'

కొత్తగూడెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఓటరు నమోదు పై ప్రత్యేక దృష్టి సాధించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఆయనకు మొదట జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఐడీవోసీ కార్యాలయంలో ఎన్నికల విభాగం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నూరుశాతం ఓటరు నమోదు కార్యక్రమాన్ని తప్పని సరిగా చేయాలని సూచించారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి ఒక్కరు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా చూడాలని, దివ్యాంగులు, ట్రాంజెండర్లను గుర్తించి నేరుగా అధికారులే వెళ్లి ఓటు కోసం దరఖాస్తుకు అవగాహన కల్పించాలన్నారు. బీఎల్‌వోలు ప్రతి రికార్డును అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని అన్నారు.



కడుపు 'కోత'లు

- ఏజెన్సీలో సిజేరియన్లు
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జాతీయ సగటు కంటే అధికం
- రాష్ట్ర సగటుతో పోలిస్తే తక్కువ...

భద్రాచలం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతి ఐదుగురిలో ఒకరికి సిజేరియన్ (సీ సెక్షన్) ఆపరేషన్ ద్వారానే గర్భిణులు తమ పిల్లలకు జన్మనిస్తున్నారు. ప్రసవాల సమయంలో ఇటీవల సిజేరియన్లకే వైద్యులు మక్కువ చూపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దేశవ్యాప్తంగా సిజేరియన్లు 21.5 శాతం ఉన్నట్లు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఆధారంగా ఢిల్లీలోని జార్జి ఇనిస్టిట్యూట్ జరిపిన అధ్యయనం వెల్లడించింది. రాష్ట్రస్థాయిలో మాత్రం 60.7 శాతం ఆపరేషన్లు జరుగుతుండటం గమనించదగ్గ విషయం. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిస్థితికి వస్తే రాష్ట్రస్థాయి సగటుతో పోలిస్తే 27 శాతమే ఆపరేషన్లు జరుగుతున్నా జాతీయస్థాయి కంటే ఎక్కువ నమోదవుతోంది. అయితే ఈ ఆపరేషన్లు అధికంగా కావడానికి కారణం సహజ ప్రసవాలంటే భయం... జననానికి ముహూర్తాలు చూసుకోవడం, ఆర్థిక స్థోమత ఉన్నా లేకున్నా వైద్యులు, ఆసుపత్రి వర్గాలు సూచించాయనే భయంతో పలువురు ఆపరేషన్లే కోరుకుంటున్నారని తెలుస్తోంది. ఇది జాతీయ ఆరోగ్య సర్వే ద్వారా వెలుగులోకి రావడం గమనించదగ్గ విషయం.

జిల్లాలో 27 శాతం...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 27 శాతం ఆపరేషన్లు ప్రభుత్వ ప్రైవేటు వైద్యశాలల్లో నిర్వహించారని ప్రభుత్వ వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లాలో ఏరియా వైద్యశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్తు సెంటర్లు మొత్తం 47 ఉన్నాయి. 2024 జూన్ నుంచి నవంబరు వరకు జిల్లాలో ప్రసవాల తీరు అధికారిక సమాచారం ఆధారంగా పరిశీలిస్తే 4,480 ప్రసవాలు ప్రభుత్వ వైద్యశాలల్లో నిర్వహించగా ఇందులో సాధారణ ప్రసవాలు 2,525, సీ సెక్షన్ 1,955 జరిగాయి. ఇక ప్రైవేటు వైద్యశాలలను పరిశీలిస్తే 1,949 మంది ప్రైవేటు వైద్యశాలల్లో ప్రసవించగా ఇందులో 483 మంది సాధారణ ప్రసవాలు, 1,466 మందికి సీ సెక్షన్ చేయడం జరిగినట్లు అధికారిక లెక్కలే చెబుతున్నాయి.

మిడ్‌వైఫ్స్ వ్యవస్థను బలోపేతం చేయాలి

మిడ్‌వైఫ్స్ విధానంతో గర్భిణులలో అత్యధిక శాతం మందిని సాధారణ ప్రసవాలకు ప్రోత్సహించేలా సంబంధిత శిక్షణ పొందిన సిబ్బంది చేస్తారు. అయితే భద్రాచలంలో 349 ప్రసవాలు జరగ్గా ఇందులో 153 సాధారణం.. 196 సీ సెక్షన్ జరిగినట్లు సమాచారం. గతంలో సీ సెక్షన్లను తగ్గించేందుకు మిడ్‌వైఫ్స్ విధానాన్ని అప్పటి వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ప్రవేశపెట్టారు. ఈ సమయంలో హైదరాబాద్‌లో కొంత మంది సీనియర్ స్టాఫ్ నర్సులకు శిక్షణ ఇచ్చి భద్రాచలం, కొత్తగూడెం వైద్యశాలల్లో వారి ద్వారా సాధారణ ప్రసవాలు నిర్వహించేందుకు విధానంను రూపొందించారు. ఆరంభంలో ఇది సాఫీగానే సాగినా అనంతరం అనుకున్నంత స్థాయిలో సాగడం లేదని సమాచారం. పీహెచ్‌సీల పరిధిలో సైతం స్టాఫ్ నర్సులకు శిక్షణ ఇచ్చి వారితో గర్భిణులకు సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు చేపడితే సీ సెక్షన్లకు అడ్డుకట్ట వేయవచ్చు అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.



భద్రాచలం ఏరియా వైద్యశాలలో సిజేరియన్ ఆపరేషన్ అనంతరం బాలింతలు

ప్రైవేటులో కోతలే...

ప్రైవేటు వైద్యశాలల్లో చాలా చోట్ల సిజేరియన్లకే వైద్యులు ప్రాధాన్యమిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇది కేవలం అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసేందుకేననే విమర్శలు సైతం లేకపోలేదు. అయితే ప్రైవేటు వైద్య వర్గాలు మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో చివరి నిమిషంలో మాత్రమే గర్భిణులు ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారని ఈ పరిస్థితుల్లో తల్లీబిడ్డ క్షేమం కోసం సిజేరియన్‌లు చేయక తప్పడం లేదని పేర్కొంటున్నారు. కాగా ప్రైవేటు వైద్యులు సైతం ప్రభుత్వ వైద్యశాలల్లో మాదిరిగా సాధారణ ప్రసవాలకు గర్భిణులను ప్రోత్సహించాలని ప్రభుత్వ వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి.

జిల్లాలో 27 శాతమే సిజేరియన్లు

డాక్టర్ ఆర్. చైతన్య ఎంసీహెచ్ పీవో



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 27 శాతం సిజేరియన్లు జరిగాయి. రాష్ట్ర సగటుతో పోలిస్తే జిల్లా మెరుగైన స్థానంలో ఉంది. అయినప్పటికీ రాబోయే కాలంలో మరింత సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు చేపడతాం. ఈ సమయంలో ప్రభుత్వ ప్రైవేటు వైద్యులు ఇందుకు సహకరించాల్సిన అవసరం ఉంది.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్

బూర్గంపాడు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగ గిరిజన యువకులు సమయాన్ని వృథా చేయకుండా అందువచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ అన్నారు. ఐటీసీ ద్వారా అందించే శిక్షణ తీసుకుని తమ కుటుంబాలను పోషించుకోవడమే కాక పదిమందికి జీవనాధారం కల్పించాలని సూచించారు. శుక్రవారం బూర్గంపాడు మండల పరిధిలోని గౌతంపురం కాలనీలోఐటిసి మిషన్ సునరకల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఒకేషనల్ శిక్షణ కేంద్రాన్ని పోవో సందర్శించారు. యువకులకు అందిస్తున్న విద్యుల్ వస్తువుల మరమ్మతుల శిక్షణలోని స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ గురించి ఐటీసీ జనరల్ మేనేజర్ చెంగళరావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణ, సెంటర్ హెడ్ నరేష్‌కుమార్, శిక్షకుడు శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ అజయ్‌కుమార్, ప్లేస్మెంట్ కోఆర్డినేటర్ జోష్ణదేవి, సిబ్బంది బలరాం, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్తుపల్లిలో యూటీఎఫ్ 6వ జిల్లా మహాసభలు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ఖమ్మం జిల్లా 6వ మహాసభలు శనివారం సత్తుపల్లిలో నిర్వహించనున్నారు. జవహర్ నగర్‌లోని నూతనంగా నిర్మించిన నండూరి సీతారామమ్మ స్మారక టీఎస్‌యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయాన్ని ఆసంఘ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గాభవాని, పూర్వపు రాష్ట్ర కార్యదర్శి బండి నర్సింహారావు, పూర్వపు గౌరవ అధ్యక్షుడు కల్యాణం నాగేశ్వరరావు ప్రారంభించనున్నారు. కార్యాలయం నుంచి మహాసభల వేదిక అయిన బాలికోన్నత పాఠశాల వరకు ఉపాధ్యాయులు మహా ప్రదర్శనగా చేరుకోనున్నారు. 15వ తేదీ సాయంత్రం వరకు ప్రతినిధుల సభకుఉపాధ్యాయులంతా హాజరవ్వాలని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చెరుకు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు కోరారు.

ఖమ్మం కథల గుమ్మం...

- నేడు ఖమ్మంలో కథాంతరంగం..
- రేపు ఈస్థటిక్స్ స్పేస్ సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం

ఖమ్మం సాంస్కృతికం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ, వర్ధమాన కథారచయితలు తరలి రానుండటంతో శని, ఆదివారాల్లో ఖమ్మం కథల గుమ్మంగా మారనుంది. ఎంపిక చేసిన కథల పరిచయాలు, చర్చలు, విశ్లేషణలతో ఖమ్మం కథల సొగసును సంతరించుకోనుంది. కొత్త కలెక్టరేట్ ఎదురుగా గల సెడార్ వ్యాలీ స్కూల్‌లో ఖమ్మం ఈస్థటిక్స్‌స్పేస్ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో కథాంతరంగం కార్యక్రమం జరుగనుంది. ఈస్థటిక్స్ సాహిత్య పురస్కారాలు 2024 కార్యక్రమంలో భాగంగా ఈకార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కథాంతరంగంలో పాల్గొనేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు కథా రచయితలను ఆహ్వానించారు. ఎంపిక చేసిన కథలపై చర్చలు, విశ్లేషణలు నిర్వహిస్తారు. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు కథాంతరంగం కొనసాగుతుంది. అనంతరం 6 గంటలకు సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్) కార్యాలయం పక్కనగల డీపీఆర్‌సీ భవనంలో ముగింపు సభ జరుగుతుంది.

ఈ కార్యక్రమంలో భాగంగా ఈస్థటిక్స్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కథల పోటీల్లో విజేతలకు, ఎంపిక చేసిన కవిత్వ సంపుటాల రచయితలకు పురస్కారాలను అందజేస్తారు. ఈ సభలో ప్రముఖ రచయిత్రి ఓల్గా, ప్రముఖ కథా రచయతలు ఖదీర్, నవీన్, ఎల్ఎస్ఆర్ ప్రసాద్ తదితర సాహితీవేత్తలు పాల్గొంటారు.

స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జాతీయ పోటీలకు ఖమ్మం క్రీడాకారులు





గోపీనాథ్, కల్యాణి, స్రవంతిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో జరిగే పలు పోటీలకు ఖమ్మం క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 17 నుంచి 21 వరకు మహబూబ్‌నగర్ జిల్లా గుండుమళ్లలో జరగనున్న ఎస్‌జీఎఫ్ అండర్-19 జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు తమ కళాశాల విద్యార్థి ఎ. గోపీనాథ్ ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ కేవీస్. రామారావు తెలిపారు. గోపీనాథ్ ఇటీవల గుడుమళ్లలోనే జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ద్వితీయస్థానం రావడంలో కృషి చేశాడని, దీంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ పోటీలకు ఎంపికైన గోపీనాథ్‌ను పీడీ బి. వెంకటేశ్వర్లు, పలువురు అధ్యాపకులు అభినందించారు. 20 నుంచి రాజస్థాన్‌లో జరగనున్న ఎస్‌జీఎఫ్ అండర్- 19 జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు తమ కళాశాల విద్యార్థినులు స్రవంతి, కళ్యాణి ఎంపికయ్యారని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారి ఖర్చులకు గాను రూ. 2,000 లు నగదును బహుమతిని అందించారు.

క్రైం సమాచారం

రెండు వ్యవసాయ మోటర్ల చోరీ

చంద్రుగొండ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిప్పనపల్లి గ్రామానికి చెందిన ఎల్లబోయిన మల్లయ్య, కందిమళ్ల శ్రీనుకు చెందిన రెండు వ్యవసాయ విద్యుత్ మోటార్లు చోరీకి గురైయ్యాయి. బాధిత రైతుల వివరాల ప్రకారం.. గ్రామ సమీపలోని పెద్దవాగు ప్రక్కనే ఉన్న పొలాన్ని సాగు చేసేందుకు గత కొన్ని సంవత్సరాలగా విద్యుత్ మోటార్లు అమర్చారు.

ఈ క్రమంలో 12 వ తేదీ (గురువారం) నారుమడికి మోటారు ద్వారా నీరు పెట్టారు. తిగి శుక్రవారం పొలంకు వచ్చి నీరు పెట్టేందుకు మల్లయ్య తన మోటారును ఆన్‌చేశాడు. మోటారు ఆన్ కాకపోవటంతో వాగులోకి దిగి చూడగా మోటారు కనిపించలేదు.

దీంతో పాటు ప్రక్కరైతు శ్రీను మోటారు సైతం మాయ్యమయింది. వీటితో పాటు కేబుల్, విద్యుత్ సామగ్రి చోరీకి గురైయినట్లు గుర్తించిన రైతులు పోలీసుకు ఫిర్యాదు చేశారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

జూలూరుపాడు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా వివాహం అవటం లేదని మనస్తాపానికి గురై మండలంలోని పాపకొల్లు పంచాయతీ బచ్చలకోయగూడెం గ్రామానికి చెందిన బత్తుల రాజేష్(25) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రాజేష్‌కు నాలుగేళ్ల క్రితం ప్రమాదంలో కుడికాలుకు తీవ్ర గాయమైంది. పెళ్లి చేసుకోవాలని ఉన్నప్పటికి కాలు గాయం తగ్గటం లేదని పలుమార్లు కుటుంబ సభ్యుల ముందు ఆవేదన వ్యక్తం చేశాడు. ఒంటరి జీవితాన్ని గడపలేక మద్యానికి బానిసయ్యాడు.

ఈ క్రమంలోనే మద్యం సేవించి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాత్రి 11:30 గంటల సమయంలో తండ్రి బత్తుల అచ్చయ్య లేచిచూడగా అతని చిన్న కుమారుడు ఉరిపెట్టుకుని దూలానికి వేలాడుతూ కనిపించాడు. తండ్రి అచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ దయానంద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గ్రామీణ వైద్యుడి మృతి



టేకులపల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇల్లెందు-కొత్తగూడెం ప్రధాన రహదారిపై మండలంలోని తొమ్మిదవ మైలుతండా గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గ్రామీణ వైద్యుడు మృతి చెందాడు. మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన కంగాల లక్ష్మయ్య(35) గ్రామంలో ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నాడు. లక్ష్మయ్య వారం రోజుల క్రితం హైద్రాబాద్‌కు వెళ్లి తిరిగి గురువారం రైలులో మహబూబాబాద్‌కు చేరుకొన్నాడు. అక్కడి నుంచి మోటారుసైకిల్‌పై స్వగ్రామం కిష్టారం వస్తున్న క్రమంలో గురువారం రాత్రి తొమ్మిదవమైలు తండా సమీపంలో మూలమలుపు వద్ద మోటారుసైకిల్ అదుపుతప్పి పక్కనున్న దిమ్మను ఢీకొట్టాడు. దిమ్మెనుఢీకొట్టి పడిపోయిన మోటారుసైకిల్, అక్కడే మృతిచెందిన గ్రామీణ వైద్యుడు లక్ష్మయ్య మృతదేహాన్ని శుక్రవారం గ్రామస్థులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. తండ్రి మారయ్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ పోగుల సురేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊట్లపల్లి సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున కారు బోల్తాపడింది. అశ్వారావుపేట నుంచి వినాయకపురం వైపునకు వెళుతున్న కారు బోల్తా పడింది. ప్రమాదంలో అశ్వారావుపేటకు చెందిన గణపతి, ప్రవీణ్, సాయి అనే యువకులకు గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను అశ్వారావుపేట తరలించి చికిత్స అందించారు. గణపతి పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

జూలూరుపాడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు కాగా వారి కుమార్తెకు స్వల్పగాయాలైన సంఘటన శుక్రవారం సాయంత్రం మండలంలోని అన్నారుపాడు శివారులో చోటుచేసుకుంది. చంద్రుగొండ మండలం సత్యనారాయణపురం గ్రామానికి చెందిన బచ్చల నర్సింహారావు, భార్య గోపమ్మ, కూతురు ఆదిలక్ష్మి కలిసి జూలూరుపాడు మండలం బచ్చలకోయగూడెంలో బంధువు ఒకరు మృతి చెందగా చూడటానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. వారు తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో అన్నారుపాడు గ్రామ శివారులో గుండ్లరేవు నుంచి జూలూరుపాడు వైపు వస్తున్న ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో వారికి గాయాలయ్యాయి. క్షతగాత్రులకు వైద్య చికిత్సలు అందించేందుకు జూలూరుపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారికి మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు కొత్తగూడెం తీసుకెళ్లారు.

యువకుడిని బలిగొన్న మధ్యవర్తిత్వం..

- పురుగుల మందు తాగి 108 ఈఎంటీ మృతి



కరకగూడెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగదుకు మధ్య వర్తిత్వం ఉండటంతో ఓ యువకుడి ప్రాణాలు గాల్లో కలిసిన సంఘటన కరకగూడెం మండలంలో శుక్రవారం జరిగింది. కరకగూడేనికి చెందిన దోమల ప్రణయ్(22) అనే వ్యక్తి 108 వాహనంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ప్రణయ్ పినపాక మండల 108 పైలెట్‌గా పని చేస్తున్న ఉమా సుబ్బారెడ్డి అనే వ్యక్తి వద్ద మధ్యవర్తిగా ఉండి పలువురికి వడ్డీకి డబ్బులు ఇప్పించాడు. తీసుకున్న వారు సకాలంలో నగదు చెల్లించక పోవడంతో సుబ్బారెడ్డి ప్రణయ్ ద్విచక్ర వాహనం లాక్కుని పోయాడు. తీవ్ర ఒత్తిడిని లోనైన ప్రణయ్ ఈనెల 6వ తేదీన పురుగుల మందు తాగటంతో కుటుంబ సభ్యులు ఖమ్మం కిమ్స్ వైద్యశాలలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మణుగూరులో శుక్రవారం శవపరీక్ష అనంతరం మృతదేహంతో కుటుంబ సభ్యులు ఉమా సుబ్బారెడ్డికి ఇంటి వద్దకు తరలించే ప్రయత్నం చేశారు. ఏడూళ్ల బయ్యారం ఎస్ఐ రాజ్‌కుమార్ క్రాస్ రోడ్డు వద్ద వారిని అడ్డుకోవడంతో బాధిత కుటుంబ సభ్యులు ధర్నాకు దిగారు. అనంతరం సీఐ వెంకటేశ్వరరావు, కరకగూడెం ఇన్‌చార్జ్ ఎస్ఐగా ఉన్న రాజ్ కుమార్ ఆందోళనకారులకు నిందితులను అదుపులోకి తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు ధర్నా విరమించారు. మృతుడి అక్క నవ్యశ్రీ ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్, ఆటో ఢీ... వ్యక్తి మృతి

అన్నపురెడ్డిపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నపురెడ్డిపల్లి మండలం నామవరం గ్రామం వద్ద శుక్రవారం రాత్రి ట్రాక్టర్ ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న కుక్కమూడి అనిల్(33) మృతి చెందగా, మాయర రామకృష్ణకు తీవ్ర గాయాలైయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెంట్లం గ్రామానికి చెందిన అనిల్, రామకృష్ణ కూలీ పనులు ముగించుకొని రాజాపురం వైపు నుంచి ఆటోలో స్వగ్రామం పెంట్లం వస్తుండగా నామవరం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాల పాలైయిన అనిల్, మరో వ్యక్తి రామకృష్ణలను కొత్తగూడెం తరలిస్తుండగా అనిల్ మార్గమధ్యలో మృతి చెందాడు. కాగా స్థానికుల సమాచారం మేరకు అన్నపురెడ్డిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

గంజాయి విక్రేతపై కేసు నమోదు

దుమ్ముగూడెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాటాయిగూడెం వద్ద స్థానిక యువకులకు గంజాయి విక్రయిస్తున్న ఒక యువకుడిని పోలీసులు శుక్రవారం పట్టుకొని కేసు నమోదు చేశారు. పట్టుబడిన నిందితుడి నుంచి రెండున్నర కిలోల గంజాయితోపాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పాల్వంచ ప్రాంతానికి చెందిన యువకుడిగా తెలుస్తోంది. నిందితుడు మైనర్ అని సమాచారం.

రేషన్ దుకాణాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు

- రెండు దుకాణాల సీజ్



ఎంఎల్ఎస్ పాయింట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ బృంద సభ్యులు

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఓఎస్డీ అంజయ్య నేతృత్వంలో శుక్రవారం ఖమ్మం నగరంలో పలు రేషన్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేదరబజారులో ఓ రేషన్ దుకాణంలో డీలర్ ఈనెల 10న ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి బియ్యాన్ని తీసుకొచ్చారు. 11 సాయంత్రానికి 29 క్వింటాళ్ల బియ్యం తక్కువగా చూపించారు. దీంతో ఆయన చెప్పిన లెక్కలకు రికార్డుల్లో ఉన్న లెక్కలకు తేడా ఉండడంతో ఆ దుకాణాన్ని సీజ్ చేశారు. ఆతర్వాత మరో దుకాణంలో ఓ మహిళా సంఘానికి చెందిన మహిళ రేషన్ దుకాణాన్ని గత నాలుగేళ్లుగా ఇన్‌చార్జి బాధ్యతలతో నిర్వహిస్తోంది. ఆమె నిర్వహిస్తున్న దుకాణంలోనూ 20 క్వింటాళ్ల బియ్యం అధికంగా చూపించింది. ఈ లెక్కలకు ఆమెను బాధ్యురాలిని చేస్తూ దుకాణాన్ని సీజ్ చేస్తున్నట్లు ఓఎస్డీ అంజయ్య తెలిపారు.

60 వసంతాల వేడుకలకు వేళాయే..

- నేడు అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో విశ్వవిద్యాలయ వేడుకలు
- హాజరుకానున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల



మాట్లాడుతున్న కళాశాల అధికారులు, రైతుసంఘం నాయకులు

అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటలో ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసి 60 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంలో వేడుకలు నిర్వహిస్తున్నారు. 1964లో వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయగా, 1989లో అశ్వారావుపేటలో అప్పటిరాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హామీతో వ్యవసాయ కళాశాలను ఏర్పాటయింది. ఇప్పటి వరకు 30 బ్యాచ్‌లలో 32,300మంది విద్యార్థులు వ్యవసాయ పట్టాలు పొంది జాతీయ, రాష్ట్రస్థాయిలో అత్యున్నత ఉద్యోగాలు పొందారు. అనేక మంది సంస్థలను ఏర్పాటు చేశారు. ఎంతో మందికి ఉపాధిని చూపుతున్నారు. ప్రస్తుతం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ఐదు వందల మంది విద్యను అభ్యసిస్తు డీన్ ఆఫ్ అగ్రికల్చర్ సత్యనారాయణ తెలిపారు.

అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో శనివారం విశ్వవిద్యాలయ వేడుకల సందర్భంగా శుక్రవారం సాయంత్రం వ్యవసాయ కళాశాల అధికారులు, రైతు సంఘం నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వేడుకలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు పలువురు హాజరవుతారని తెలిపారు. వేడుకల సందర్భంగా రైతులతో ముఖాముఖి, వ్యవసాయ క్షేత్ర సందర్శన, స్టాల్స్ ఏర్పాటు, విద్యార్థులకు బహుమతుల ప్రదానంతో పాటు అనేక కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు పునాది వేసిన అనాటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా నేడు వ్యవసాయ కళాశాలలో వజ్రోత్సవ వేడుకలు జరగటం హర్షణీయం అని రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్, రైతు సంఘం నాయకులు బండి భాస్కర్ అన్నారు. ఈసమావేశంలో అసోసియేట్ డీన్ హేమంత్‌కుమార్, విశ్వవిద్యాలయ అధికారి గోపాలకృష్ణ, రైతుసంఘం నాయకులు చెన్నకేశవరావు, సత్యనారాయణ చౌదరి, నిర్మల పుల్లారావు, సత్యనారాయణ, పాష, జీవనరావు, వేణుగోపాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

రేపు ప్రకృతి వ్యవసాయ రైతు సదస్సు



మాట్లాడుతున్న రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు

ఖమ్మం, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లాలో రసాయనిక వ్యవసాయాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు ఈనెల 15న ఆదివారం ఖమ్మంలోని ఈఆర్ఆర్(సీక్వెల్)రిసార్ట్స్‌లో ప్రకృతి వ్యవసాయ రైతు సదస్సు నిర్వహిస్తున్నామని రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మంలోని ఈఆర్ఆర్ రిసార్ట్సులో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రసాయనిక ఎరువులు, పరుగుమందులతో సాగుతున్న వ్యవసాయం కారణంగా ప్రజల ఆరోగ్యాలు పాడవుతున్నాయని అన్నారు. ఈరైతు సదస్సుకు ప్రముఖ ప్రకృతి వ్యవసాయ ఆదర్శరైతు విజయ్‌రామ్‌తో పాటు రాష్ట్రంలోని పలువురు ప్రముఖులు హాజరవుతున్నారని, ఒక గోవు ద్వారా పది ఎకరాలపైగా వ్యవసాయాన్ని చేసుకునే పద్ధతులను కూడా వివరించబోతున్నారని తెలిపారు. ఫిబ్రవరి 14నుంచి 10రోజులపాటు హైదరాబాదులోని కన్హాశాంతివనంలో 10వేల మందితో జాతీయ రైతు ప్రకృతి వ్యవసాయ సదస్సు నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈసమావేశంలో ప్రకృతి వ్యవసాయ రైతు, శాస్త్రవేత్త చల్లా నాగేశ్వరరావు, వి. వెంకటాయపాలెం సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదుబాబు, ఖమ్మం కమ్మ మహాజనసంఘం ప్రధాన కార్యదర్శి గుడవర్తి నాగేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ మహిళ రైతు పుతుంబాక మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల విలువ అంచనాల సేకరణ

భద్రాచలం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం దక్షిణం వైపు ఉన్న ఇళ్ల విలువ అంచనాలను సేకరించేందుకు శుక్రవారం వెళ్లిన రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులకు ఇంటి యజమానుల నుంచి తొలుత సానుకూలత లభించలేదు. మేము ఇళ్లు ఇవ్వడానికి సిద్ధమే.. మాకు నోటీసులివ్వండి...అనంతరమే మా ఇళ్లల్లోకి వచ్చి భవనాల విలువ అంచనాలను సేకరించాలని పలువురు ఇళ్ల యజమానులు అధికారులకు స్పష్టం చేశారు. దీంతో కొద్దిసేపు ప్రతిష్టంభన నెలకొనగా, కొంత మంది అధికారులు వివరాలు సేకరించేందుకు సహకరించడంతో మార్గం సుగమమైంది. దీంతో మొత్తం 43 ఇళ్లకు గాను 19 ఇళ్ల విలువ అంచనాలను ఆర్అండ్‌బీ అధికారులు సాంకేతిక లెక్కల ఆధారంగా సేకరించారు. ఈ నెల 9న సైతం రామాలయ ప్రాంత భూ నిర్వాసితులు రెవెన్యూ అధికారులకు వివరాలు ఇచ్చేందుకు సంతకం పెట్టేందుకు తొలుత ససేమిరా అన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులు నచ్చజెప్పడంతో ఎట్టకేలకు బ్యాంకు పేరు ఖాతా వివరాలు, ఆధార్‌కార్డు వివరాలు ఇవ్వకుండానే సంతకాలు చేశారు. మళ్లీ శుక్రవారం సైతం దాదాపుగా అదే పరిస్థితి పునరావృతమై చివరకు ఇంటి యజమానులు సహకరించడంతో అధికారుల వివరాల సేకరణకు మార్గం సుగమమైంది.



మంత్రి తుమ్మలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

మంత్రి తుమ్మలను కలిసిన లారీ యూనియన్ నాయకులు

సత్తుపల్లి/చంద్రుగొండ, డిసెంబరు 13 (ఆన్‌లైన్): సత్తుపల్లి టిప్పర్, లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రావి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యవర్గం బాధ్యులు, లారీ యజమానులు వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శుక్రవారం ఆయన స్వగృహం దమ్మపేట మండలం గండుగలపల్లిలో కలుసుకున్నారు. సత్తుపల్లి మండలంలోని ఓపెన్‌కాస్టు బొగ్గు గని నుంచి లారీలకు బొగ్గు రవాణా అవకాశం కల్పించేందుకు కృషి చేసినందుకు అసోసియేషన్ బాధ్యులు తుమ్మలకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులతో తుమ్మల మాట్లాడుతూ లారీ యజమానులు ఏ సమస్యా ఉన్నా తన దృష్టికి తేవాలని పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకుడు మౌలాలి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు. అన్ని విధాల వెనుకబడి ఉన్న చంద్రుగొండ చంద్రుగొండ మండల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని మండల కాంగ్రెస్ నాయకులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావును కోరారు. వ్యవసాయ శాఖతో పాటు వివిధ శాఖల నుంచి అధిక నిధులు మండలానికి కేటాయించేదుకు కృషిచేయాలని సీనియర్ నాయకులు ఉప్పతల ఏడుకొండలు, గాదె శివ ప్రసాద్, నల్లమోతు రవి, బడుగు కృష్ణవేణి, లక్ష్మన్ మంత్రిని కోరారు.

'పీఎం కుసుమ్'లో మహిళలను భాగస్వామ్యం చేయాలి..

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్

కొత్తగూడెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో పీఎం కుసుమ్ పథకంలో స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యం చేయడానికి తహసీల్దార్లు సహకరించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో తహసీల్దార్లతో ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్, ఫారెస్టు, రెవెన్యూ శాఖల సమన్వయంగా సబ్‌స్టేషన్ మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న పోడు భూములకు సంబంధించిన గిరిజన రైతుల భూములను గుర్తించి సోలార్ విద్యుత్ యూనిట్లను నెలకొల్పే విధంగా పూర్తిస్థాయిలో సర్వే చేసి త్వరితగతిన ప్రతిపాదనలు అందచేయాలన్నారు. స్వయం సహాయక మహిళా గ్రూపులకు సోలార్ విద్యుత్‌యూనిట్లను అనువైన ప్రదేశాల్లో మెగావాట్ విద్యుత్ నిర్మాణానికి మహిళలకు 90శాతం బ్యాంకు రుణం లభిస్తుందని అన్నారు. గిరిజన రైతుల కుటుంబాల్లోని మహిళా సభ్యులు స్వయం సహాయక బృందాల్లో గనక ఉంటే కనీసం 3 ఎకరాల పొలం ఉంటే తప్పని సరిగా మెగాసోర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు.



రాజకీయాలకు అతీతంగా ఇళ్లు మంజూరు చేయాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించాలని సీపీఎం ఖమ్మం డివిజన్ సెక్రటరి వై.విక్రమ్ పేర్కొన్నారు. శుక్ర వారం ఖమ్మంఅర్బన్ సీపీఎం మండల కమిటీ సమావేశం ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌పాలనలో ఇళ్లులేని వారికి న్యాయం జరగలేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో అయినా ఇళ్లు మంజూరు చేయాలన్నారు. అర్హులకు న్యాయం చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా పేదలకు ఈపథకం వర్తింపచేయాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్‌కే మీరాసాహెబ్, మండల కార్యదర్శి బి.ఉపేంద్ర, నాయకులు గోవిందా, నాగేశ్వరరావు, మధు, శ్రీనివాసరావు తదితరులు పలాజ్గన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	28 రూ.
వంకాయ	24
గుత్తి వంకాయ	30
బీరకాయ	48
పచ్చిమిర్చి	26
కాకరకాయ	38
బెండకాయ	38
పొట్లకాయ	38
దోసకాయ	24-34
చిక్కుడు	48
నాటుచిక్కుడు	88
గోరుచిక్కుడు	34
క్యాబేజీ	24
దొండ	40-48
సొరకాయ	18
క్యారెట్	64
క్యాప్సికం	64
ఆలుగడ్డ	38
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్లు ట్రే (30 గుడ్లు)	195
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా

CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	పుష్ప 2
శ్రీనివాస:	పని
సాయిరాం:	మిస్‌యూ
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	పుష్ప 2



ఖాళీగా కూర్చొన్న వైద్య బృందాలు

వైద్య బృందాల సమయం వృథా

- ప్రచారం లేకుండానే శిబిరం ఏర్పాటు
- ముగ్గురు ప్రత్యేక వైద్యులు, 20 మంది సిబ్బంది రోజంతా ఖాళీ

ఖమ్మంసంక్షేమ విభాగం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కనీస ప్రచారం లేకుండా, ఒక ఫ్లెక్సీ కూడా ఏర్పాటు చేయకుండా ఏర్పాటు చేసిన వైద్యశిబిరం చివరకు అబాసుపాలైంది. ఖమ్మం రవాణాశాఖ కార్యాలయంలో శుక్ర వారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కార్యాలయం కావటంతో బయటవారికి విషయం తెలియలేదు. వాహనదారులు వైద్య పరీక్షలకు ముందుకు రాలేదు. ఈ శిబిరానికి వచ్చిన ముగ్గురు ప్రత్యేక వైద్య నిపుణులు, ఎంబీబీఎస్ వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, ల్యాబ్ సిబ్బంది, ఫార్మసి సిబ్బంది మొత్తం 20మంది వరకు సాయంత్రం వరకు ఖాళీగానే కూర్చొని వెళ్లారు. ఇదే వైద్య శిబిరం కార్యాలయం బయట ఏర్పాటు చేస్తే స్థానిక ప్రజలైన సేవలు పొందేవారు. అధికారుల తీరుపై స్థానికులు విమర్శలు గుప్పించారు.

పచ్చదనంపై పట్టింపేదీ?

కూసుమంచి డివైడర్లలో ఎండిపోతున్న మొక్కలు



కూసుమంచి రహదారి డివైడర్‌లో ఎండిపోతున్న మొక్కలు

కూసుమంచి, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): పాలేరు నియోజకవర్గకేంద్రమైన కూసుమంచిలో డివైడర్ మధ్యలో ఏర్పాటుచేసిన మొక్కలు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎండిపోతున్నాయి. మూడేళ్ల క్రిందట ప్రధాన రహదానిని 100 మీటర్ల రహదారిగా విస్తరించారు. ఇందులో భాగంగా డివైడర్ మధ్యలో అందమైన పూల మొక్కలు నాటారు. అయితే నిర్వహణ లోపం కారణంగా విలువైన మొక్కలన్నీ ఎండిపోతున్నాయి. పచ్చదనం పెంపుకోసం మీడియన్ ప్లాంటేషన్‌లో భాగంగా సుమారు రూ.10లక్షల వ్యయంతో వీటిని ఏర్పాటుచేశారు. కూసుమంచి వీహెచ్‌సీనుంచి గుర్వాయిగూడెం క్రాస్‌రోడ్డు వరకు సుమారు 1.5కిలోమీటర్ల పొడవునా, నేలకొండపల్లి వెళ్లే రహదారిలో క్యాంపు కార్యాలయం వరకు కిలోమీటరు దూరంలో మొక్కలను నాటారు. నీరందించేందుకు డైరెక్ట్ వాటర్ లైన్ కూడా వేశారు. ఇటీవల పైప్‌లైన్ ద్వారా నీరు అందకపోవడంతో మొక్కలన్నీ చనిపోతున్నాయి. రహదారుల డివైడర్ల మధ్య అందమైన మొక్కలు పెంచి ఆహ్లాదాన్ని పెంచాలనే ఉద్దేశ్యంతో లక్షలాది రూపాయలు వెచ్చించినప్పటికీ లక్ష్యం నెరవేరకుండా అయిపోతుంది. మొక్కలకు నీరందించేందుకు ఉద్దేశించి ప్రభుత్వం ట్రాక్టర్ ట్యాంకర్ ఏర్పాటుచేసినా..ఉపయోగంలో లేకుండా పోయింది. పంచాయితీ యాజమాన్యం నిర్లక్ష్యంపట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

అధికారులు పక్కనుంచి వెళుతున్నా..

జిల్లా కేంద్రం ఖమ్మం నుంచి మండలస్థాయి అధికారులు ఎంపీడీవో, తహసీల్దార్, ఎంపీవో వంటి సంబంధిత అధికారులు నిత్యం ప్రయాణిస్తున్నారు. ఐనా మొక్కలు ఎండిపోతున్నా పట్టించుకోకపోవడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈవిషయమై ఎంపీవో రామచంద్రరావును మొక్కల సంరక్షణకు అవసరమైన నీరు సరఫరా చేసేందుకు అవకాశం లేకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయని, సంరక్షించేందుకు ప్రయత్నిస్తామంటూ తెలిపారు. ఇప్పటికైన అధికారులు దృష్టిసారించి పచ్చదనం పెంపుకు శ్రద్ధవహించాలని కోరుతున్నారు.

అర్హులందరికీ 'ఇందిరమ్మ' ఇళ్లు

- గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి



కొక్కిరేణిలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ఖమ్మంరూరల్,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడి హామీ ఇచ్చారు. మండల పరిధిలోని కొండాపురం, గొల్లగూడెం, ఆటోనగర్, శ్రీరాంనగర్, ఇందిరమ్మ కాలనీ, సాయిగణేష్ నగర్, తదితర గ్రామాల్లో శుక్ర వారం మంత్రి పొంగులేటి పర్యటించారు. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు, రహదారులు, మురుగునీటి కాల్వలు, తదితర అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతా క్రమంలో కృషి చేస్తామని తెలిపారు. ఇంకా ఏమైనా అవసరాలు ఉంటే వాటి వివరాలను తమకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి, మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ హరినాథబాబు, నాయకులు కల్లెం వెంకటరెడ్డి, బండి జగదీష్, మద్ది మల్లారెడ్డి, మద్ది వీరారెడ్డి, నాగండ్ల శ్రీనివాసరావు, సురేష్, రవి, సీపీఐ జిల్లా సహయ కార్యదర్శి దండి సురేష్, దండి రంగారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

తిరుమలాయపాలెం:మండలంలోని కొక్కిరేణి, బీరోలు, బచ్చొడు, బచ్చొడుతండా, హస్నాబాద్, సుబ్లేడు, పాతర్లపాడు గ్రామాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. కొక్కిరేణి ప్రభుత్వజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 54మందికి కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను అందించారు. నిరుపేదలందరికి సంక్షేమ పథకాలు అందించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పాలేరు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పరిచి ఆదర్శ నియోజకవర్గంగా తయారు చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ పీవీ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్‌సాహెబ్, పీఆర్ ఈఈ వెంకటరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, ఏడీఏ సరిత, ఏఎంసీ వైస్‌చైర్మన్ వనవాసం నరేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బెల్లం శ్రీను, యన్నం సుధాకర్‌రెడ్డి, రామసహాయం వెంకటరెడ్డి, ముక్కపాటి నాగేశ్వరరావు, జడల నగేష్, ఓర వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

మంత్రికి వినతుల వెల్లువ

కూసుమంచి, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజలు శుక్రవారం కూసుమంచిలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడికి వినతిపత్రాలు అందించారు. అర్హులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఎం రైతు సంఘం నాయకులు రమణారెడ్డి, తాళ్లూరి రాజు,పన్యతిరావు, గంగాధర్ తదితరులు మంత్రికి వినతిపత్రం అందించారు. స్కాలర్‌షిప్ ఫీజులు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మస్తాన్, వేతనాలు పెంచాలని పంచాయతీ కార్మికులు వినతిపత్రం అందించారు. అదేవిధంగా పలువురు వృద్దాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లు మంజూరీ చేయాలని, భూముల సమస్యలు పరిష్కరించాలని మంత్రిని కలిసి వినతిపత్రాలు అందించారు.

కేఎంసీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల నంబర్లు

ఆర్ఐ పేరు	డివిజన్	సెల్ నెంబర్
ఆర్ విజయానంద్	5, 7, 15, 16	99518 39272
ఏ జ్యోతి	6,7,8,9,10,11,12	99661 51544
వీ రామారావు	1,6,8,15,17,21	99890 23869
ఏ సుధాకర్	1,7,13,14,16,17,18,19,20	97041 48482
కే శ్రీనివాస్	1,2,3,4,12	70136 76876
జీ. శ్రీనివాసరావు	రెవెన్యూ ఆఫీసర్	84669 07055

నోట్.(రెండు సార్లు అంకెలు వచ్చిన ప్రాంతాలు ఉమ్మడి ప్రాంతాలుగా గుర్తించాలి)

పేస్కేల్‌పై అసెంబ్లీలో మాట్లాడుతా

- సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎమ్మెల్యే కూనంనేని హామీ
- దీక్షా శిబిరం సందర్శన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి):విద్యాశాఖ సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు పేస్కేల్‌పై అసెంబ్లీ సెషన్స్‌లో మాట్లాడతానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చారు. ఖమ్మం కలెక్టరేట్ వద్ద దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఎస్ఎస్ఏలో పని చేస్తున్న ప్రతీ ఒక్కరికి కనీస వేతన స్కేల్ అమలు చేయాలని, కేజీబీవీల్లో కేర్‌టేకర్లను నియమించాలన్నారు. ప్రభుత్వ మహిళా ఉపాధ్యాయులకు వర్తించే అన్నీ సెలవులు కేజీబీవీ ఉపాధ్యాయులకు వర్తింపచేయాలన్నారు. ఎస్ఎస్ఏలో పనిచేస్తున్న టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ విషయాలపై అసెంబ్లీలో మాట్లాడి, పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు.మాజీఎమ్మెల్సీ పూల రవీందర్, ఖమ్మం,భద్రాద్రి జిల్లాల పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, డి.వెంకటేశ్వర్లు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. జిల్లా అధ్యక్షులు షేక్ మహబూబ్ పాషా, రాష్ట్రప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి న్యాయమైన డిమాండ్ పేస్కేలు ఇచ్చి న్యాయం చేయాలన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ రైతు వ్యతిరేక పార్టీలే

- కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): నాడు కేసీఆర్ ప్రభుత్వం ఖమ్మంలో మిర్చి రైతుకు బేడీలు వేస్తే, నేడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లగచర్ల కేసులో రైతులకు బేడీలు వేసిందని బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు రైతువ్యతిరేక పార్టీలేనని కిసాన్ మోర్చారాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి అన్నారు. లగచర్ల కేసు నేపథ్యంలో వైద్య చికిత్స కోసం తీసుకు వెళుతున్న రైతు హీర్యానాయక్‌కు బేడీలు వేసి తీసుకు వెళ్లడాన్ని అత్యంత క్రూరమైన చర్యగాశ్రీధర్‌రెడ్డి అభివర్ణించారు.కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ శుక్రవారం ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లాఅధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్ మోర్చా నాయకులు సోమగాని ఎల్లారావు గౌడ్, వల్లభనేని పుల్లయ్య, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనంత ఉపేందర్, నకిరేకంటి వీరభద్రం, రుద్ర ప్రదీప్ పాల్గొన్నారు.

మాజీఎంపీటీసీ హఠాన్మరణం



తిరుమలాయపాలెం, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహ్మదాపురం మాజీ ఎంపీటీసీ, టీడీపీనాయకురాలు ఇర్రి హేమలత(58) శుక్రవారం ఆమె గుండెపోటుతో మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. టీడీపీ నుంచి ఎంపీటీసీగా గెలిచి అనేక ప్రజాసేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇటీవల ఎన్నికల్లో పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆమె భౌతిక కాయానికి జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, గండమాల సుందర్ రావు, మాజీసర్పంచ్ బేతమమళల అఖిలప్రేమ్‌సాగర్ తదితరులు నివాళులర్పించారు.

'రైతులకు సంకెళ్లు వేయడం అన్యాయం'

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వమని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ పాలనలో రైతులకు సంకెళ్లు వేయడం అన్యాయమని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ శుక్రవారం ఒకప్రకటనలో ఖండించారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లాలో రైతులకు సంకెళ్లు వేసిన సంఘటనపై విమర్శలు చేసిన కాంగ్రెస్ పార్టీ నేడు తన పాలనలో ఇటువంటి ఘటనలకు ఆస్కారం ఇవ్వడం శ్రేయస్కరం కాదన్నారు. మరోసారి ఇటువంటి ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రకటనలో కోరారు.

'గ్రూప్2'ను పారదర్శకంగా నిర్వహించాలి

- అధికారులతో కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డితో కలిసి గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై సమీక్షించారు.15,16తేదీల్లో నిర్వహించే ఈపరీక్షకు జిల్లాలో 28,101 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని, దీనికి వీలుగా మొత్తం 85 పరీక్ష కేంద్రాలు సిద్ధం చేశామన్నారు. పరీక్షల ప్రశ్న పత్రాలు, ఓఎంఆర్ షీట్లు రిసీవ్ చేసుకొని ప్రతీ హాల్‌కు అందించేందుకు ఫ్లోర్ ఇన్‌చార్జిలను నియమించామనిఅన్నారు. పరీక్షహాల్‌లోకి ఇతరులు ప్రవేశించడానికి వీలు లేదన్నారు. ఎటువంటి అవకతవకలకు ఆస్కారం ఉండకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను ఉదయం సెషన్‌లో 8:30 నుంచి, మధ్యాహ్నం సెషన్‌లో 1:30 నుంచి అనుమతించనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలగేటు ఉదయం 9:30కు, మధ్యాహ్నం 2:30కు మూసివేస్తామని, దీని తర్వాత పరీక్ష కేంద్రాలకు ఎవరిని అనుమతించడం జరగదన్నారు. అభ్యర్థులు క్యాలిక్యులేటర్, సెల్‌ఫోన్,పెన్ డ్రైవ్,బ్లూటూత్ డివైసెస్, జువెలరీ, ఎలక్ట్రానిక్ గాడ్జెట్ లాంటి వస్తువులు తీసుకుని రావడానికి వీల్లేదని, చెప్పులు మాత్రమే వేసుకుని రావాలని షూస్ అనుమతిలేదన్నారు. ఈ సమావేశంలో రీజినల్ కోఆర్డినేటర్‌లు వి. చిన్నయ్య,జి.రాజ్‌కుమార్,డీఆర్వో రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, పరీక్షా సీఎస్‌లు, అబ్జర్వరు పాల్గొన్నారు.

పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు

నేలకొండపల్లి, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు పీఆర్సీని వెంటనే ప్రకటించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వెంగళరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నేలకొండపల్లి సింగారెడ్డి ప్రాథమిక పాఠశాలలో జరిగిన టీపీటీఎఫ్ సబ్‌కమిటీ సమావేశంలో మాట్లాడారు. సంఘం మండల అధ్యక్షుడు తేజావత్ గోవిందరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం మానిఫెస్టోలో ప్రకటించిన విధంగా పెండింగ్ డీఏలను విడుదల చేయాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు టి.గోవిందరావు, ప్రధాన కార్యదర్శి రామారావు, నాయకులు చీనా, రవి, నాగేశ్వరరావు, వీరబాబు పాల్గొన్నారు.

విద్యా మహాసభల్లో భవిష్యత్తు కార్యాచరణ

యూటీఎఫ్ జిల్లా నాయకుడు అరవిందకుమార్

నేలకొండపల్లి, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలో జరుగనున్న విద్యా మహాసభల్లో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని యూటీఎఫ్ జిల్లా నాయకుడు రావెళ్ల అరవిందకుమార్ అన్నారు. ఆరో జిల్లా విద్యా మహాసభల పోస్టర్‌ను శుక్రవారం సాయంత్రం అరవిందకుమార్ ఆవిష్కరించారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన మహాసభల్లో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు మందడపు శ్రీనివాసరావు, తొర్తి గురవయ్య, నవాబు, పద్మ, జ్యోతి, విజయ్, కరుణశ్రీ పాల్గొన్నారు.

పార్కుల నిర్వాహణ సక్రమంగా ఉండాలి

మేయర్ పునుకొల్లు నీరజ
28, 29 డివిజన్లలోని పార్కుల తనిఖీ



ఫౌంటేన్‌ను పరిశీలిస్తున్న మేయర్

ఖమ్మంసంక్షేమవిభాగం,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): పార్కుల నిర్వాహణ సక్రమంగా ఉండాలని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. శుక్రవారం 28,29డివిజన్లలోని పార్కులను తనిఖీలు చేశారు. విధులకు హాజరైన కార్మికుల వివరాలను తెలుసుకున్నారు.వాకర్స్‌తో మాట్లాడుతూ పార్కులో నిత్యం ఏదైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. జయశంకర్ పార్కులో వాటర్ ఫౌంటేన్ నిర్వాహణపై పలు ఆదేశాలిచ్చారు. ఓపెన్ జిమ్‌లు మరమత్తులు చేయించాలని సూచించారు. వాకింగ్ ట్రాక్‌పై సైడ్‌బౌండ్రివాల్ నిర్మాణం చేయాలని ఆదేశించారు. మరమ్మతులకు గురైన మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ట్యాంక్‌బండ్‌పై ఆదాయ వనరులు పెంచే ఆలోచనలు చేయాలని కోరారు. కార్పొరేటర్‌లు కొప్పెర సరిత, గజ్జల లక్ష్మీ, ఉద్యాన అధికారి బెల్లం రాధిక, పర్యాటకశాఖ అధికారి సుమన్ చక్రవర్తి, ఏఈ శ్రీనివాస్, కొప్పెర ఉపేందర్, గజ్జల వెంకన్న పాల్గొన్నారు.

మెడికోల స్వాగతోత్సాహం

ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న దృశ్యం, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఖమ్మంకలెక్టరేట్,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాల విద్యార్థులు శుక్రవారంరాత్రి సందడి చేశారు. కళాశాలలో మెదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో ఏడాది మెడికల్ విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు.' ఉద్భవ్' పేరుతో నిర్వహించిన ఈ వేడుకల్లో మెడికోలు హంగామా సృష్టించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, వైస్‌ప్రిన్సిపాల్ సమత, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్ కిరణ్‌కుమార్, హెచ్‌వోడీలు, డాక్టర్ సమతారాణి, సృజన తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ఫ్రెషర్స్‌డేను ప్రారంభించారు. అంకితభావంతో స్నేహపూర్వక వాతావరణంలో విద్యార్థులు కలిసిమెలిసి ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు ఉద్బోధించారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

ఇన్‌చార్జ్ డీఈవో శ్రీనివాసరావు

ఖమ్మంఖానాపురంహవేలి డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీల్లో సిబ్బంది సమ్మె చేస్తున్న నేపథ్యంలో విద్యార్థినులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఇన్‌చార్జ్ డీఈవో చావా శ్రీనివాసరావు తెలిపారు. ఖమ్మం రూరల్, తిరుమలపాలెం, రఘునాథపాలెం కేజీబీవీలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు కేజీబీవీల సమీపంలోని ఉన్నత పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను కేజీబీవీలకు పంపినట్లు తెలిపారు.

విద్యార్థినులకు రగ్గుల పంపిణీ

జిల్లాలోని పలు కేజీబీవీలు, ఖమ్మంలోని యూఆర్ఎస్, భవిత కేంద్రాలను శుక్రవారం సీఎంఓ రాజశేఖర్ సందర్శించారు.వెలుగుమట్లలో ఉన్న ఖమ్మం అర్బన్ కేజీబీవీలో విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారాన్ని ఆయన పరిశీలించారు. సీఎంఓ రాజశేఖర్, ఖమ్మంఅర్బన్ ఎంఈఓ శైలజ లక్ష్మి విద్యార్థినులకు రగ్గులు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటేషన్ పై కేజీబీవీకి వచ్చిన ప్రభుత్వఉపాధ్యాయులు రాయల మాధవి లత, షమీన్ సుల్తానా, రుక్మిణి పాల్గొన్నారు.

ముగిసిన సీఎం కప్ మండల స్థాయి క్రీడలు

ఖమ్మంరూరల్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొల్లగూడెంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సీఎం కప్ మండల స్థాయి క్రీడలు శుక్రవారం ముగిశాయి. మహిళలకు క్రీడలు నిర్వహించారు. వాలీబాల్, ఖో ఖో, కబడ్డీ, పోటీలను నిర్వహించారు. కబడ్డీలో గుదిమళ్లకు ప్రథమ బహుమతి, ఏదులాపురం ద్వితీయ బహుమతి, వాలీబాల్‌లో తల్లంపాడు ప్రథమ బహుమతి, గుదిమళ్ల ద్వితీయ బహుమతి, ఖో ఖో లో ఏదులాపురం ప్రథమ బహుమతి, పెద్దతండా ద్వితీయ బహుమతి సాధించారు. గెలుపొందిన వారికి ఎంఈఓ శ్రీనివాస్ ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సీఎం కప్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న మున్సిపల్(పట్టణ)స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు ముగిశాయి. పోటీల ఆఖరి రోజు సుమారు 200 మంది క్రీడాకారులు హాజరైనారు. శుక్రవారం హ్యాండ్‌బాల్, నెట్‌బాల్, ఫుట్‌బాల్ విభాగాలలో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలను మున్సిపల్ మేనేజర్ విజయానంద్ క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రారంభించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నర్సింహమూర్తి, అథ్లెటిక్స్ కోచ్ గౌస్, వాలీబాల్ కోచ్ అక్బర్‌అలీ తదితరులు ఉన్నారు.

సత్తుపల్లిలో ఈజీఎస్ సామాజిక తనిఖీలు ప్రారంభం

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలంలో శుక్రవారం నుంచి ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులకు సామాజిక తనిఖీలు ప్రారంభమైనాయి. 10మంది డీఆర్‌పీలు మూడు టీములుగా ఏర్పడి వారికి కేటాయించిన గ్రామ పంచాయతీల వారీగా తనిఖీలు నిర్వహించనున్నారు. 01-04-2023 నుంచి 31-03-2024 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై తనిఖీలు నిర్వహించిన అనంతరం ఈనెల 15 నుంచి 19 వరకు గ్రామసభలు నిర్వహించనున్నారు. 20న సత్తుపల్లిలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామసభ ఉంటుందని ఈజీఎస్ ఏపీవో ఎం.బాబు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తుపల్లిరూరల్/కల్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్వహణ నిమిత్తం శనివారం ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శరత్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ద్వారకాపూరి కాలనీ, పోస్టాఫీస్‌రోడ్, లలితకుమారి ఆసుపత్రి రోడ్, జూపల్లి ఆసుపత్రి వీధి, శ్రీనివాసా థియేటర్ రోడ్, జలగం నగర్, వేంసూర్ రోడ్, ఎన్టీఆర్ నగర్, కృషి బైపాస్ రోడ్, విద్యానగర్, వాణీ విద్యాలయం, కొత్తూరు, మహాత్మాగాంధీ రోడ్, కల్పతరువు రోడ్, అవని వెంచర్ ప్రాంతాల్లోని వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నేడు కల్లూరులో

కల్లూరు (ఆంధ్రజ్యోతి): కల్లూరులో విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సాంకేతిక మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సబ్‌స్టేషన్ ఏఈ వెంకట్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కల్లూరు, లోకారం, పుల్లయ్యబంజరు, లక్ష్మాతండ, హనుమతండ, చాంద్యతండ, జీడి బోయినపల్లి, బోడిమల్లె, వాచ్యనాయక్‌తండ, కె నారాయణపురం, ఏ నారాయణపురం, కప్పలబందం, పేరువంచ, పి వెంకటాపురం, కిష్టయ్యబంజరు, గన్యాతండ గ్రామాలకు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గురుకుల సమస్యలు పరిష్కారమయ్యేనా?

- నేడు జ్యోతిబాపూలే గురుకులానికి డిప్యూటీ సీఎం భట్టి రాక
- విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేయనున్న భట్టి
- సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూపు

బోనకల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోనకల్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాలను శనివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సందర్శించనున్నారు. రెండు రోజులుగా మండల అధికారులు ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. శనివారం ఉదయం 11:40 గంటల నుంచి 2:20 వరకు పాఠశాలలో ఆయన గడపనున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేయనున్నందున ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

గురుకులంలో నెలకొన్న ప్రధాన సమస్యలు

- 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 400 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుతం 8 తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. ఇంకా 6 గదుల అవసం ఉంది.
- గదుల కొరతతో విద్యార్థుల బోధనతో పాటు నిద్రించే గది కూడ ఒక్కటే కావడంతో వారి సామాన్లు కూడ అక్కడే పెట్టుకుంటున్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నారు.
- డార్మెటరీ గది సరిపోవడం లేదు. మరొక గది కావాల్సి ఉంది.
- టాయ్‌లెట్స్ 18 ఉండగా మరో 10 యూనిట్లు కావాల్సి ఉంది. పాఠశాల భవనాలకు వైట్‌వాష్ లేదు. మిషన్ భగీరథ నీటికి సంబంధించి మంచినీటి ట్యాంకు నిర్మించాల్సి ఉంది. నీటి ఎద్దడిని నివారించేందుకు బోర్‌వెల్‌కు నిధులు మంజూరు జరగాల్సి ఉంది.



బోనకల్‌లోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల

ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వేడుకోలు

పదేళ్లుగా మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాల సమస్యలతో కునారిల్లుతుంది. నాటి ప్రభుత్వం సమస్యలను పరిష్కరించక పోవడంతో విద్యార్థులు సమస్యలతోను చదువులను సాగిస్తున్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడినందున విద్యపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో పాటు అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న డిప్యూటీ సీఎం పర్యటనతో గురుకులం నెలకొన్న సమస్యలు పరిష్కారం అవుతాయన్న ఆశాభావాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఏఐహెచ్‌ఆర్ జిల్లా అధ్యక్షుడిగా వినుకొండ



కల్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆల్‌ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్(ఏఐహెచ్‌ఆర్) ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా వినుకొండ శ్రీనివాస్ ఎంపికైనారు. హైదరాబాద్‌లో సుందరయ్య భవన్‌లో శుక్రవారం ఏర్పాటైన ఏఐహెచ్‌ఆర్ సమావేశంలో సంస్థ ఫౌండర్ డాక్టర్ సురేష్‌కుమార్, ఇండియా అధ్యక్షుడు రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ తారక రాజన్న నుంచి నియామకం పత్రం అందజేశారు. నూతనంగా ఎన్నికైన శ్రీనివాస్ మాట్లాడుతూ మానవ హక్కులపై నిరుపేదలకు గ్రామ స్థాయిలో సదస్సుల ద్వారా అవగాహన కల్పించి చైతన్య పరుస్తానని చెప్పారు. మండల పరిధిలోని తాళ్లూరు వెంకటాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు సామాజిక సేవలు గుర్తించి ఏఐహెచ్‌ఆర్ ఫౌండేషన్ ఎంపిక చేసినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమలో హైకోర్టు అడ్వకేట్ సురేష్‌బాబు, వైస్‌చైర్మన్ హైజక్ రవి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

చింతకాని, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫారసు మేరకు మండల పరిధిలోని నేరడ గ్రామానికి చెందిన పగిళ్లపల్లి అప్పమ్మకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును శుక్రవారం సీపీఐ సీనియర్ నాయకులు దూసరి గోపాల్‌రావు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మంకెన నాగేశ్వరరావు, పగిళ్లపల్లి నారాయణ, మట్టా శంకర్‌రావు, మట్టా రవి, మట్టా పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న దృశ్యం

పంట పొలాల్లో కాల్చడం వల్ల భూసారం తగ్గుతుంది

- మధిర, వైరా ఏడీఏలు విజయచంద్ర, కరుణశ్రీ
- బోనకల్, వైరాలో రైతులకు అవగాహన కార్యక్రమాలు

బోనకల్/వైరా డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న, వరి పంట కోతల తరువాత మిగిలిన చెత్తను పొలాల్లో కాల్చడం వల్ల భూసారం తగ్గిపోతుందని మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర సూచించారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో శుక్రవారం పంట కోతల అనంతరం చేపట్టే సాగు విధానాలపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. కాల్చడం వల్ల నేలకు ప్రయోజనం చేకూర్చే క్రిమి కీటకాలు నశించడంతో పాటు వాయు కాలుష్యం పెరుగుతుందన్నారు. ప్రధానంగా భూమిలో ఉండే నత్రజని, పాస్పరస్ వంటి పోషక పదార్థాల శాతం తగ్గుతుందని తెలిపారు. పంట అవశేషాలను భూమిలో కలిపి దున్నడం వలన సేంద్రియ కర్బన శాతం పెరిగి దిగుబడులు పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో పసునూరి వినయ్ కుమార్, ఏఈవోలు మరీదు త్రివేణీ, రైతులు పాల్గొన్నారు.



వైరా మండలంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ కరుణశ్రీ, వ్యవసాయ శాస్త్రవేత్తలు

వరి కొయ్యలను కాల్చవద్దు

వైరా (ఆంధ్రజ్యోతి): వైరా వ్యవసాయ సహయసంచాలకులు తుమ్మలపల్లి కరుణశ్రీ ఆధ్వర్యంలో శుక్రవారం క్షేత్రప్రదర్శన చేశారు. రైతు శిక్షణ కేంద్రం, ఖమ్మం నుంచి సాంకేతిక వ్యవసాయ అధికారి డి.అరుణకుమారి, అరుణజ్యోతి, సోమవరం గ్రామంలో వరికోసిన తరువాత వరి కొయ్యలను కాల్చ వద్దని సింగిల్ షూపర్ పాస్పేట్ వేసి గడ్డి కుళ్లిన తరువాత మళ్లీ దమ్ము చేసి నేల సారవంతం కోల్పోకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి నయాన్ మంజుఖాన్, ఏఈవో మేడా రాజేష్, రైతులు కోర్తి శ్రీనివాసరావు, గొల్లపుడి సుబ్బారావు, ప్రకాష్‌రావు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్ నిర్మాణంతో రేజర్ల గ్రామంలో తిప్పలు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామంలో నూతనంగా నిర్మితమవుతున్న బైపాస్ రోడ్ నిర్మాణంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సత్తెమ్మగుడి దాటిన తర్వాత సత్తుపల్లికి కొత్తూరు గ్రామం మీదుగా రహదారిని నూతనంగా నిర్మిస్తున్నారు. ఆ నిర్మాణం ఆలస్యం కావడంతో రేజర్లలోని మెయిన్ రోడ్డుకు లింక్ కలిపేందుకు పాతరోడ్డు గతేడాది తవ్వడంతో రోడ్డు ఛిద్రంగా మారింది. వర్షాకాలంలో నానా యాతన పడ్డ ప్రజలు ప్రస్తుతం గతులమయంగా మారిన రోడ్డులో దుమ్ముధూళి లేవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గుంతలమయంగా రేజర్లలోని మెయిన్ రోడ్

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి: సీపీఎం

బోనకల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తెలంగాణ రైతుసంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలులో ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.31వేల కోట్ల రుణమాఫీ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 18వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారని తెలిపారు. రైతు భరోసా ఇవ్వకుండా నిర్లక్ష్య వైఖరిని అవలంబించడం సరికాదన్నారు. రైతు సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం వినతిపత్రాన్ని గిర్దావర్ లక్ష్మణ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా, మండల నాయకులు గుడ్డూరి ఉమ, దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేష్, తుళ్లూరి రమేష్, నల్లమోతు వాణి, గుగులోతు పంతు, పాపినేని అప్పారావు, బందం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి: డీఐఈవో

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని ఖమ్మం డీఐఈవో రవిబాబు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు, అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. కళాశాల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రయత్నం చేయాలని, విద్యార్థులు రెగ్యులర్‌గా కళాశాలకు వచ్చేలా చూడాలని, వారి మానసిక ప్రవర్తన పట్ల జాగ్రత్త వహించాలన్నారు. సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించాలని, స్టడీ అవర్స్ నిర్వహణకు కౌన్సిలర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా కళాశాలకు రాని విద్యార్థుల ఇళ్లను సందర్శించి తల్లిదండ్రులతో మాట్లాడి హాజరు శాతం పెంచాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

టీఎస్ యూటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి

చింతకాని, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలో శని, ఆదివారాల్లో జరిగే టీఎస్ యూటీఎఫ్ జిల్లా 6వ మహాసభలను విజయవంతం చేయాలని సంఘ మండల ప్రధాన కార్యదర్శి తోటకూరి శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని పాతర్లపాడులో మహాసభల పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జీఎస్ వి రమణ, యూ నాగేశ్వరరావు, రాజయ్య, జయకర్ తదితరలు పాల్గొన్నారు.

సన్మార్గంలో నడిపేందుకే క్రీస్తు బోధనలు

కల్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మానవాళిని సన్మార్గంలో నడిపేందుకు ఏసుక్రీస్తు మార్గదర్శకుడిగా నిలిచారని ప్రముఖ దైవ సందేశకులు రాజా హెబేల్ అన్నారు. గురువారం రాత్రి కల్లూరులో ఏఐసీసీ(అసోసియేషన్ ఆఫ్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ) ఆధ్వర్యంలో ఘనంగా ఐక్య క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రపంచంలో కరుణ, శాంతి, సమాధానము స్థాపించుటకు ఏసు జన్మించాడని చెప్పారు. ఏఐసీసీ రాష్ట్ర అధ్యక్షుడు పి.ఎనోష్‌కుమార్ మాట్లాడుతూ క్రైస్తవులు ఐక్యంగా శాంతి సమాధానముతో, క్రీస్తు దీవెనలు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏఐసీసీ జిల్లా ప్రేయర్ సెల్ అధ్యక్షుడు నిర్మల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు బిషప్ జల్లి జైపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్నాసి బాలరాజు, మీడియా సెల్ జిల్లా అధ్యక్షుడు దాసరి డేవిడ్ రాజు, మండల అధ్యక్షుడు ఎబినేజర్ మాజీ జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, లక్కినేని రఘు, సీఐ హనోక్, తదితరులు పాల్గొన్నారు.



దైవ సందేశకులు రాజా హెబేల్, మాజీ ఎమ్మెల్యే సండ్ర

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు

బోనకల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు ఆరోపించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఆ పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఉచిత బస్సు ప్రయాణం తప్ప మిగిలిన వాటిని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అధికారం కోసం అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చారని ఆరోపించారు. రుణమాఫీ, రైతు భరోసాతో పాటు నిరుద్యోగ భృతి లాంటి పథకాల అమలు గురించి ప్రశ్నిస్తే ఆర్థిక పరిస్థితి బాగలేదని చెబుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. పాలకుల నిర్లక్ష్య వైఖరి పై పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేష్, తుళ్లూరి రమేష్, మర్రి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పొన్నం వెంకటేశ్వరరావు

గీతామందిరంలో ఘనంగా హనుమత్ వ్రతం

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ పార్థసారధిస్వామి గీతాజ్ఞాన మందిరంలో హనుమత్ వ్రతం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంతోష్ శాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణలతో పంచామృతాభిషేకాలు, హనుమాన్ చాలీసా పారాయణం, తమలపాకులతో సహస్ర నామార్చన, అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించినట్లు ట్రస్ట్ ఛైర్మన్ కొత్తూరు రాజా తెలిపారు. పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. నెలరోజుల పాటు నిర్వహించే ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా ఈనెల 16వ తేదీ నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో గుడివాడ వీరరాఘవ వెంకటేశ్వరరావు, బాల లీలాకృష్ణారావు, నరుకుళ్ల సత్యావతి, రాయల పుష్పావతి, గుడివాడ చక్రధర్, కొనకళ్ల శంకరరావు, తిరునగరి వెంకటనర్సయ్య, వనమా నరేష్, కొనకళ్ల శారద, విజయ, రత్నకుమారి, కోటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.



వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా

కల్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కల్లూరులో శుక్రవారం స్థానిక ప్రాంతీయ వైద్యశాల ఎదుట ఆసుపత్రి కార్మికులు ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు మాట్లాడుతూ నాలుగు నెలలు గడుస్తున్న వేతనాలు విడుదల చేయక పోవటంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతీ నెల 5వ తేదిలోగా వేతనాలు చెల్లించాలని, ప్రమాద బీమా, వ్యక్తి గత బీమా, కనీస వేతనం చట్టం ప్రకారం రూ. 26 వేలు అందించాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వైద్యాధికారి రమాదేవికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దమాల దయాకర్‌రావు, కార్మికులు వంశీ, ప్రమోద్, మేరీ, రమాదేవి, సత్యవతి, జాన్‌బి తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ కానుక పై పాస్టర్లతో తహసీల్దార్ సమావేశం

మధిరటౌన్, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగకు క్రిస్టియన్‌లకు ప్రభుత్వం ఇచ్చే కానుకలపై తహసీల్దార్ రాంబాబు మండలం లోని వివిద చర్చిల పాస్టర్లతో తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రతి సంవత్సరం క్రిస్మస్ పండుగను క్రైస్తవులు ఆనందంతో జరుపుకునేందుకు ప్రభుత్వం ఇచ్చే విందు తో పాటు కానుకను ఈ సంవత్సరం కూడా ముందుగానే ఇవ్వనుందని తెలిపారు, అర్హులైన వారికి ఆయా చర్చిలలో ఈ కానుకలు అందిచేస్తే ఎలా ఉంటుందని వారిని అడిగి తెలుసుకున్నారు.

రైతులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలి

వైరా, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణం కోసం వైరా నియోజకవర్గంతో జూలూరుపాడు, ఏన్కూరు గిరిజన మండలాల రైతులు ఇచ్చిన 136 ఎకరాల భూములకు ఎకరానికి రూ.40 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని సీపీఎం వైరా డివిజన్ కమిటి కార్యదర్శి భూక్యా వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. శుక్రవారం వైరా బోడేపూడి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వీరభద్రం మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా ఉన్న సమస్యలను ప్రస్తావిస్తు వాటితోపాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కే.నరేంద్ర, చెరుకుమల్లి కుటుంబరావు, బాణాల శ్రీనివాసరావు, కొండబోయిన నాగేశ్వరరావు, దొడ్డపనేని కృష్ణార్జునరావు, బోయినపల్లి శ్రీనివాసరావు, బానోత్ బన్సీలాల్ తూము సుధాకర్, వజ్జా రామారావు, బాదావత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం డివిజన్ కార్యదర్శి వీరభద్రం

మెప్మా ఆర్పీల ముందస్తు అరెస్టు

మధిరటౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్ నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా మధిర మునిసిపాలిటీలో పనిచేసే మెప్మా రిసోర్స్ పర్సన్‌లను శుక్రవారం మధిర టౌన్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఇటీవల అంగనవాడీలు జరిపిన ఆందోళన ఉద్రిక్తలకు దారి తీయడంతో పోలీసులు మెప్మా ఆర్పీలను ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో మాధవి, కృష్ణవేణి, విజయలక్ష్మీ, ఉన్నారు.

రైతుకు సంకెళ్లు అమానుషం: తెలంగాణ రైతు సంఘం

వైరా డిసెంబరు 13: (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో అరెస్టై జైలులో ఉన్న రైతు హీర్యానాయక్‌కు గుండెపోటు వస్తే, చికిత్స కోసం పోలీసులు రైతుకు సంకెళ్లు వేసి ఆసుపత్రికి తరలించడం అమానుష చర్య అని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. రైతు సంకెళ్లను నిరసిస్తూ తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రాంబాబు మాట్లాడుతూ రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం వైరా పట్టణ అధ్యక్షుడు మల్లెంపాటి రామారావు, జిల్లా కమిటీ సభ్యుడు బాణాల శ్రీనివాసరావు, కౌలురైతు సంఘం నాయకుడు యనమద్ది రామకృష్ణ, పల్లెబోయినకృష్ణ, కురగుంట్ల శ్రీనివాసరావు, వడ్లమూడి మధు, సీఐటీయూ నాయకులు సుంకర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రైతుసంఘం నాయకులు

నేడు కారేపల్లిలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పర్యటన

కారేపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కారేపల్లి మండలంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ శనివారం పర్యటిస్తారని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు తలారి చంద్రప్రకాష్ శక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కారేపల్లి పీహెచ్‌సీకి మంజూరైన అంబులెన్స్‌ను ఆరోగ్య కేంద్రంలో ప్రారంభిస్తారన్నారు. అనంతరం వైఎస్ఎన్ గార్డెన్‌లో లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీచేస్తారని తెలిపారు. ఎమ్మెల్యే పర్యటనలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతంచేయాలని కోరారు.

కిష్టారం భూ నిర్వాసితులతో ఆర్డీవో, పీవో సమావేశం

సత్తుపల్లి, డిసెంబరు 13 (ఆన్‌లైన్): సత్తుపల్లి మండలం కిష్టారంలోని కిష్టారం ఓపెన్ కాస్టు బొగ్గుగని ప్రాంతంలో భూ నిర్వాసితులతో శుక్రవారం రెవెన్యూ, సింగరేణి, పంచాయతీరాజ్, జలవనరులశాఖ అధికారులు సమావేశమయ్యారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కల్లూరు ఆర్డీవో రాజేందర్‌గౌడ్, జేవీఆర్ ఓపెన్ కాస్టు బొగ్గుగని పీవో ఎన్‌వీఎస్.ప్రహ్లద్ పాల్గొన్నారు. బాధిత రైతులు అధికారులతో మాట్లాడుతూ కిష్టారం ఓసీలో సేఫ్ జోన్ కోసం సేకరించే 36.02 ఎకరాలకు సంబంధించి ఎకరాకు రూ.30లక్షలు పరిహారం ఇవ్వాలని కోరారు. కలెక్టర్‌ను ఎమ్మెల్యే రాగమయి నాయకత్వంలో కలసిన సందర్భంలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీనిపై ఆర్డీవో మాట్లాడుతూ రైతుల డిమాండ్‌ను కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఈ నెల 17న గ్రామసభ కిష్టారంలో నిర్వహిస్తామని అదే రోజు నిర్ణయం తెలియజేస్తామన్నారు. న్యాయమైన ప్యాకేజీ ఇవ్వకుంటే ఆందోళన తప్ప తమకు వేరే మార్గం లేదని రైతులు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ యోగీశ్వరరావు, పీఆర్, జలవనరుల శాఖ అధికారులతో పాటు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, కిష్టారం నాయకులు ఉడతనేని అప్పారావు, నరుకుళ్ల అప్పారావు, నరుకుళ్ల రవి పాల్గొన్నారు.



రైతులతో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు